
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
కృష్ణా జిల్లా వార్తలు
సోమవారం 8 డిసెంబరు 2025



అద్దె భవనాలే దిక్కు!



అద్దె భవనంలో ఖనిజ, భూగర్భ, జలశాఖ అధికారుల కార్యాలయాలు

ప్రభుత్వ కార్యాలయాలకు సమకూరని సొంత భవనాలు

మూడేళ్లుగా అరకొర వసతులతో అద్దె భవనాల్లో నెట్టుకొస్తున్న అధికారులు

జిల్లాల విభజన జరిగి మూడేళ్లు కావస్తున్నా ఇంకా జిల్లా పరిపాలనాపరంగా గాడిన పడలేదు. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో విజయవాడలోనే మకాం ఉన్న అధికారులు, కృష్ణాజిల్లాగా విడిపోయిన తర్వాత కూడా వారు అక్కడే నివాసం ఉండి, చుట్టపు చూపుగా మచిలీపట్నం వచ్చి వెళ్తున్నారు. కలెక్టర్, జేసీ, డీఆర్వో మినహా మిగిలినశాఖల అధికారులు జిల్లా హెడ్ క్వార్టర్‌లో నివాసం ఉండటం లేదు. ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు సమకూర్చే ఆలోచన చేయడంలేదు. దీంతో అధికశాతం కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు పాతవి అయినా వాటిలోనే కొనసాగు తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు ఎప్పుడు సమకూరుతాయో తెలియని అయోమయం నెలకొంది.

- మూడు జిల్లాలుగా విడిపోయిన ఉమ్మడి కృష్ణాజిల్లా
- ఉద్యోగుల సర్వీసు నిబంధనలు ఇంకా ఉమ్మడి జిల్లా పరిధిలోనే..
- పూర్తిస్థాయిలో గాడిన పడని పరిపాలన


అద్దె భవనంలో ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ కార్యాలయం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గతంలో 16 అసెంబ్లీ నియోజకవర్గాలు, మూడు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఉమ్మడిగా ఉన్న కృష్ణాజిల్లాను, కృష్ణాజిల్లా, ఎన్టీఆర్‌జిల్లాగా విభజించడంతోపాటు, గతంలో జిల్లాలో ఉన్న నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఏలూరు జిల్లాలో విలీనం చేశారు. ఈ రెండున్నర జిల్లాల్లో ఉద్యోగుల బదిలీలు, ఇతరత్రా అంశాలకు సంబంధించి కృష్ణా కలెక్టరే పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ఉద్యోగుల బదిలీలు, ఇతరత్రా పరిపాలనా పరమైన అంశాలకు సంబంధించి ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల కలెక్టర్లు మిగతా 6లో..

కార్యాలయాల్లో సిబ్బంది నిల్

ప్రభుత్వ కార్యాలయం అంటే జిల్లాస్థాయి అధికారి, ఆయన వద్ద పూర్తిస్థాయిలో కార్యాలయ సిబ్బంది, కారు, ఇతరత్రా హంగామా ఉండాలి. కానీ జిల్లాల విభజన జరిగిన తర్వాత కింది స్థాయి, సిబ్బందితో పాటు కార్యాలయంలో సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు, బిళ్లబంట్రోతులు ఉండాలి. కానీ వీరెవరూ ప్రస్తుతం లేరు. కలెక్టర్, జేసీల వద్ద కూడా ఈ సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో వేరే మండలాల్లో పనిచేసే సిబ్బందిని డెప్యుటేషన్‌పై తెచ్చుకుని పని చేయించుకోవాల్సిన పరిస్థితి ఉంది. గతంలో జెడ్పీ సీఈవోకు జిల్లా పరిషత్ ప్రాంగణం లోనే బంగ్లా ఉండగా, ఈ బంగ్లాను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయానికి కేటాయించారు. దీంతో జెడ్పీ సీఈవో ఎక్కడ నివాసం ఉండాలో తెలియని పరిస్థితి. ఐదు రోజులు క్రితం ఏర్పాటు చేసిన డీఎల్‌డీవో కార్యాలయాలను కూడా అద్దె భవనాల్లోనే ప్రారంభించారు.

హనుమాన్ జంక్షన్‌లోని ఓ భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్



టాప్ గేర్!

జిల్లాలో పీఎం సూర్యఘర్‌కు విశేష స్పందన

- అగ్రస్థానంలో మచిలీపట్నం డివిజన్.. తర్వాత స్థానంలో గుడివాడ
- 3,227 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఇన్‌స్టాలేషన్
- ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచితంగా ఏర్పాటు
- స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న గృహ యజమానులు

ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం టాప్‌గేర్ అందుకుంది. రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటులో కృష్ణాజిల్లా వడివడిగా అడుగులు ముందుకు వేస్తోంది. జిల్లాలో మచిలీపట్నం, గుడివాడ డివిజన్‌లు దూసుకుపోతున్నాయి. వీటిలో హనుమాన్‌జంక్షన్ సబ్ డివిజన్ అగ్రస్థానంలో కొనసాగుతోంది.

(ఆంధ్రజ్యోతి, హనుమాన్ జంక్షన్): గృహ విద్యుత్ వినియోగ దారుల విద్యుత్ ఖర్చును గణనీయంగా తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రెండు కిలోవాట్ల సామర్థ్యానికి 60 శాతం, అంతకుపైబడిన యూనిట్లకు 40 శాతం ఇచ్చే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు వస్తున్నారు. జిల్లాలో బందరు డివిజన్ సోలార్ ప్యానెల్స్ నిర్మాణంలో ముందంజలో ఉండగా, గుడివాడ డివిజన్ రెండవ స్థానంలో ఉంది. బందరు డివిజన్‌లో 1,300 గృహాలపై ఏర్పాటు చేయగా, గుడివాడ డివిజన్‌లో 3,727 కేవీ మిగతా 6లో..

డివిజన్‌లో 8,600 గృహాలు లక్ష్యం : ఈఈ

విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించుకోవడానికి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ సోలార్ ప్యానెల్స్‌పై అత్యధిక విద్యుత్ వినియోగించే ప్రజల్లో ఆసక్తి కనిపిస్తోందని గుడివాడ డివిజన్ ఈఈ జి.బి.శ్రీనివాస్ తెలిపారు. డివిజన్‌లో 8,600 గృహాలకు లక్ష్యం పెట్టుకున్నామని చెప్పారు. ప్రస్తుతం 3వేలకు పైగా సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచితంగా సోలార్ ప్యానెల్స్ అందించడానికి ముందుకు రావడంతో మరో 5,600 యూనిట్లు నిర్మించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.

2025-26 జోలికి వెళ్లొద్దు!

- జలవనరుల శాఖ పనుల వివరాలు అడిగిన విజిలెన్స్
- అధికార పార్టీ నేతలను ఆశ్రయించిన కాంట్రాక్టర్లు
- ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం ఇవ్వని జలవనరుల శాఖ

'విజిలెన్స్'కు రాజకీయ సిఫార్సులు



జలవనరులశాఖలో ఈ నీటి సంవత్సరం (జూన్ నుంచి మే వరకు) జరిగిన పనులపై నాణ్యతను పరిశీలించాలన్న విజిలెన్స్ విభాగానికి ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడిగిన సమాచారం ఇవ్వడానికి జలవనరుల శాఖ అధికారులు వాయిదాల పర్వం కొనసాగిస్తున్నారు. దీని వెనుక అసలు కారణం రాజకీయ సిఫార్సులని విమర్శలు వినిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): కృష్ణాజిల్లాకు చెందిన అధికార పార్టీ నేత జిల్లాలో 2024-25, 2025-26 నీటి సంవత్సరాల్లో జలవనరుల శాఖలో జరిగిన పనుల నాణ్యతను పరిశీలించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు కొద్దిరోజుల క్రితం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆ శాఖ అధికారులు స్పందించి కృష్ణా తూర్పు డెల్టా పరిధిలో ప్రతిపాదించిన పనులు, టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ల వివరాలు, పనులకు నిర్ణయించిన అంచనాల వివరాలను అందజేయాలని విజిలెన్స్ అధికారులు జలవనరుల శాఖ అధికారులకు లేఖ పంపారు. ఇప్పటి వరకు విజిలెన్స్ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

రాజకీయ ఒత్తిడి

విజిలెన్స్ అధికారులు ఈ పనుల సమాచారం గురించి పదేపదే అడుగుతున్న క్రమంలో కథలోకి రాజకీయ నాయకులు ప్రవేశించారు. కృష్ణా జిల్లాకు చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు విజిలెన్స్‌లోని ఓ అధికారికి ఫోన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. 2025-26 నీటి మిగతా 6లో..

పెరుగుతున్న కేసులు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో స్క్రబ్ టైఫస్ భయం

ఇప్పటికి 17 కేసుల నమోదు.. ఒకరి మృతి

- ఇదే అదనుగా రెచ్చిపోతున్న ప్రైవేటు ఆస్పత్రులు
- పట్టించుకోని అధికారులు.. ఆందోళనలో ప్రజలు



స్క్రబ్ టైఫస్ టెస్ట్, కిట్

విజయవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో స్క్రబ్ టైఫస్ వ్యాధి మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం 17 కేసులు నమోదయ్యాయి. ఇందులో ఒకరు మరణించారు. ఇవి అధికారికంగా నమోదైన లెక్కలు. అనధికారికంగా ఈ కేసుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని సమాచారం. స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూనే.. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం తప్పదని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యవసాయ పనులు చేసేవారు జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్న క్రమంలో ప్రజలతో పాటు జిల్లా వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికశాతం మందికి ఈ వ్యాధిపై అవగాహన లేదు. అధికారులు అప్రమత్తమవడంతో పాటు ప్రజలకు దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరముంది. ఇది సాధారణ జ్వరం లాంటిదైనప్పటికీ ఆలస్యం చేస్తే శరీరంలో అంతర్గ మిగతా 6లో..

వర్షాకాలం జాగ్రత్త!

వర్షాకాలం సీజన్‌లోనే స్క్రబ్ టైఫస్‌కు కారణమైన బాక్టీరియా వృద్ధిలో ఉంటుంది. రైతులు పంట పొలాలకు వెళ్లినప్పుడు బూట్లు/చెప్పులు కచ్చితంగా వేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పంట పొలాల్లో సంచరించే ఎలుకలు, పక్షుల ద్వారా పంట చేలు, గట్లపై నల్లి, పేడపురుగు లాంటి కీటకం చేరి పొలాల్లో పనిచేసే సమయంలో మనుషులను కుట్టే అవకాశం ఉంది. గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉండే ప్రాంతాలు, ఇంటి పరిసరాల గడ్డిలో ఈ పురుగు ఉంటుంది.

స్క్రబ్ టైఫస్ లక్షణాలు

- ✔ స్క్రబ్ టైఫస్ వ్యాధి తీవ్ర జ్వరంతో పాటు తలనొప్పి, చలితో మొదలవుతుంది.
- ✔ కండరాల నొప్పులు, లింఫ గ్రంథులు వాపు ఉంటాయి.
- ✔ కొందరికి కళ్లు ఎర్రబడతాయి.
- ✔ దగ్గు కూడా ఉంటుంది.
- ✔ కొంతమంది శరీరంపై దద్దుర్లు ఏర్పడతాయి
- ✔ రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి, వృద్ధులకు ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి.
- ✔ స్క్రబ్ టైఫస్ లక్షణాలు కనిపించిన మూడు రోజుల్లో రక్తపరీక్షలు చేయిచుకోవాలి
- ✔ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కాలేయంపై ప్రభావం చూపుతుంది.
- ✔ తర్వాత కిడ్నీ దెబ్బతిని డయాలసిస్‌కు దారితీయొచ్చు.
- ✔ సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే అన్ని ప్రధాన అవయవాలపై ప్రభావం చూపుతుంది.



- బ్రహ్మ కమల వికాసం

బ్రహ్మకమలం.. ఇది రాత్రి వేళ వికసించే అరుదైన పుష్పం. కౌతవరం గ్రామానికి చెందిన చాపరాల జగన్మోహనరావు పెరట్లోని మొక్క ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 80 పుష్పాలను విరబూసింది. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో మొగ్గలు విచ్చుకోవడం ప్రారంభమై తొమ్మిది గంటలకల్లా వికసించాయి. ఒకే మొక్కకు ఇన్ని పుష్పాలు పూయడం ఇదే మొదటి సారి అని జగన్మోహనరావు తెలిపారు. వీరి పెరటిలోనే మరో రెండు చిన్న మొక్కలు కూడా ఉన్నాయి. వాటికి కూడా పదికిపైగా పుష్పాలు వచ్చాయి. ఎప్పుడూ ఇన్ని పూలు ఒక మొక్కకు రావడం చూడలేదని స్థానికులు ఆశ్చర్యం వ్యక్త చేశారు. తమ సెల్ ఫోన్లలో ఫొటోలు తీస్తూ సందడి చేశారు. -(ఆంధ్రజ్యోతి-గుడ్లవల్లేరు)

ఫిట్‌నెస్‌పై పోరు

గత నెలలో చార్జీలు భారీగా పెంచిన కేంద్రం

- నిరసనగా లారీల బంద్‌కు లారీ యజమానుల సంఘం పిలుపు
- 9వ తేదీ అర్ధరాత్రి నుంచి అమలు చేయనున్న యజమానులు
- జిల్లాలో నిలిచిపోనున్న ఐదు వేల లారీలు
- నిత్యావసర సరుకుల రవాణాకు ఏర్పడనున్న ఆటంకం
- ఫలితంగా ధరలు పెరిగే అవకాశం
- నిర్మాణ రంగంపైనా పెనుప్రభావం



భారీ వాహనాలకు కేంద్ర ప్రభుత్వం పెంచిన ఫిట్‌నెస్ చార్జీల ప్రభావం సామాన్యుడిపై పడనుంది. ఒకేసారి పది రెట్లకుపైగా చార్జీలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం గత నెలలో ఇచ్చిన ఉత్తర్వులపై ఉమ్మడి కృష్ణాజిల్లాలోని లారీ యజమానులు భగ్గుమంటున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులకు నిరసనగా ఈ నెల తొమ్మిదో తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా లారీలను నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర లారీ యజమానుల సంఘం ఆదివారం ప్రకటించింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు జిల్లాలో ధాన్యం తరలింపు నుంచి కూరగాయలు, ఆకుకూరలు, పాల ఉత్పత్తులు, నిర్మాణ రంగ సామగ్రి రవాణా నిలిపివేస్తామని జిల్లాలోని లారీ యజమానులు స్పష్టం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ): దేశంలో 13 ఏళ్లకు పైబడిన భారీ వాహనాలకు గతంలో రూ.1,340 ఉండే ఫిట్‌నెస్ చార్జీలను ఏకంగా రూ.33,040కి పెంచుతూ గత నెల 11వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఒకే మిగతా 6లో..

ఆగని మ్యూటేషన్ మాయ!

గుడివాడ మున్సిపాల్టీ పేరుతో తాజాగా పేరు మార్పు సర్టిఫికెట్ జారీ

గుడివాడ పురపాలక సంఘంలో మ్యూటేషన్ దోపిడీ ఇంకా కొనసాగుతోంది. కొందరు అవినీతి అధికారులు మామూళ్లు ఇస్తే చాలు ఎవరి ఇంటి పన్ను పేరునైనా మార్చేస్తున్నారు. దీంతో కోట్లాది రూపాయల ఆస్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్‌లు జరిగిపోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బయటపడిన రూ.60 లక్షల కుంభకోణంలో బాధ్యులైన వారిపై నేటికీ మున్సిపల్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని పలువురు అవినీతి అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శలు వస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి - గుడివాడ: మున్సిపాల్టీ పరిధిలో ఆస్తులు కొనుగోలు చేస్తే తప్పకుండా వారి పేర్ల మీద ఆస్తిపన్ను పేరును మార్చుకోవలసి ఉంది. దీని కోసం నిర్దిష్ట రుసుమును చెల్లించాలి. మున్సిపాల్టీ పరిధిలో మ్యూటేషన్ (ఆస్తి పేరు మార్పు) చేయాలంటే దరఖాస్తుదారుడు ప్రస్తుత ఆస్తి విలువలో ఒక శాతం మొత్తాన్ని ఖచ్చితంగా మున్సిపాల్టీకి మిగతా 6లో..


గుడివాడ మున్సిపాల్టీ నుంచి జారీ చేసిన రశీదు

- తమ పరిధిలో జరగలేదంటున్న మున్సిపల్ కమిషనర్
- డీఎంఏలో జరిగిందంటూ దాటవేత
- ఆ తర్వాత తప్పు జరిగిందంటూ హడావిడిగా పాత పేరు కొనసాగిస్తూ ఉత్తర్వులు
- ఇంటి పన్ను పేరు మార్చి రూ.1.50 కోట్ల ఆస్తికి అక్రమ రిజిస్ట్రేషన్!
- గతంలో రూ.60 లక్షల మ్యూటేషన్ స్కాంలో చర్యలు నిల్

అర్ధ శతాబ్దిలో అపూర్వ కలయిక!
- చౌటపల్లి ఉన్నత పాఠశాల 1975 నాటి ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థుల స్వర్ణోత్సవం
6

పదోతరగతి పరీక్షల ఫీజు గడువు పెంపు
6

భవానీ దీక్ష విరమణ పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఆధ్యాత్మిక, చారిత్రాత్మకం విజయవాడ నగరం

» కృష్ణవేణి సంగీత నీరాజనంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

విజయవాడ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక, చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన నగరం విజయవాడ అని, కృష్ణవేణి సంగీత నిరాజనం ద్వారా దక్షిణ భారతదేశంలోనే కాకుండా దేశంలో మరో సాంస్కృతిక కేంద్రంగా నిలిచిందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. భారత పర్యాటక మంత్రిత్వశాఖ, సాంస్కృతిక శాఖ, జౌళి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్ర



మంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యాంశాస్త్రి ముగ్గురూ ఆంధ్రులేనని, తెలుగు భాషలో వెలువడిన వారి కీర్తనలు భారతీయ భక్తి సంగీతానికి అమూల్య వారసత్వమన్నారు. అన్నమాచార్య, రామదాసు, క్షేత్రయ్య వంటి వాగ్గేయకారులు తెలుగుని భక్తి సంగీత భాషగా మలిచారన్నారు. కూచిపూడి నాట్యం ప్రపంచానికి ఆంధ్రప్రదేశ్ బహూకరించిన శాస్త్రీయ నృత్య కళారూపమన్నారు. దీనితో పాటు పలు కళారూపాలను ఆయన కొనియాడారు. మహాత్మ గాంధీ 1946లో మద్రాసులో త్యాగరాజ కీర్తనల మాధుర్యాన్ని ప్రస్తావించిన సంఘటనను గుర్తు చేస్తూ సంగీతం సర్వోన్నత కళ అన్నారు. కేంద్ర పర్యాటక శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ వెంకట్రామన్ హెగ్డే మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటకరంగం పురోభివృద్ధికి ఊతమివ్వడం యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు పొందే వీలు ఏర్పడుతుందన్నారు. సాంస్కృతిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రజల మధ్య సంబంధాలు పెరుగుతాయన్నారు. గతేడాది కోటిమంది విదేశీయులు దేశాన్ని సందర్శించడం వలన రూ.2.93 లక్షల కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. ఇది కేవలం పర్యాటక, సాంస్కృతిక విశిష్టతే కారణమన్నారు. కేంద్ర పర్యాటకశాఖ సంచాలకులు ఆర్.వెంకటేషన్ మాట్లాడుతూ, కృష్ణవేణి సంగీత నిరాజనం పర్యాటక అభివృద్ధిలో ఒక పరివర్తనాత్మక పాత్ర పోషిస్తుందని, సాంస్కృతిక జ్ఞాపక శక్తిని రూపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుల మల్లికార్జునరావు కర్ణాటక సంగీతంపై చిత్రించిన పెయింటింగ్స్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మల్లాది బ్రదర్స్, విహన్‌రాజా, రంజనీ వాసుకి, రుక్మిణి శ్రీ కృష్ణ, అర్చన అండ్ ఆరతి, తిరుమల శ్రీనివాస, కే.ఎన్.రంగనాథ్ శర్మ, శంకర్ నంబుద్రి, అయ్యగారి శ్యాం సుందరం గాత్ర, వాద్య కచేరీలు ఆద్యంతం అలరించాయి.



భవానీ దీక్ష విరమణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

భవానీ దీక్ష విరమణ పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భవానీ దీక్ష విరమణ ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే సంబంధిత ఉద్యోగులు, కాంట్రాక్టర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్ హెచ్చరించారు. ఆదివారం ఆయన భవానీ దీక్ష విరమణ ఏర్పాట్ల పనులను ఈఈ రాంబాబు, బోర్డు సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, పెనుమత్స రాఘవరాజులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో క్యూలు, స్నానఘట్టాలు, ప్రసాదం తయారీకేంద్రాలు, అన్నదానం ఏర్పాట్లు, హోమగుండాలు, ఇరుముడుల సమర్పణ పాయింట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా భవానీ దీక్ష విరమణలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్నిశాఖలు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. భవానీలు, భక్తులు దేవస్థానం ఉద్యోగులకు సహకరించాలని, మరిన్ని వివరాలకు దేవస్థానం యాప్‌ను సంప్రదించాలని ఈవో కోరారు. కార్యక్రమంలో డీఈలు రవీంద్ర, అశోక్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెరుగుతున్న కేసులు

(5వ పేజీ తరువాయి)

అవయవాలపై ప్రభావం చూపిస్తోందని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఈ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు మండల పరిధిలో ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక ప్రైవేటు ఆస్పత్రులు స్క్రబ్ టైఫస్ వ్యాధిని పురస్కరించుకుని భారీగా సొమ్ము చేసుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కరోనా సమయంలో ఇలాగే జరిగిన విషయం తెలిసిందే. సాధారణ జ్వరాన్ని స్క్రబ్ టైఫస్ అని భయాందోళనకు గురిచేస్తూ పేదల నుంచి డబ్బు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్క్రబ్ టైఫస్ వ్యాధికి సంబంధించిన ల్యాబ్, మందులు ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


శరీరంలోకి నేరుగా ప్రవేశించదు

- డి.శారద, అసోసియేట్ ప్రొఫెసర్, సిద్దార్థ మెడికల్ కాలేజీ

స్క్రబ్ టైఫస్ బ్యాక్టీరియా శరీరంలోకి నేరుగా ప్రవేశించలేదు. బ్యాక్టీరియాను మోసుకెళ్లే ఈగలు, పేలు, నల్లులు, చిగ్గర్లు కుట్టడం ద్వారా ఈ బ్యాక్టీరియా మానవుని శరీరంలోకి ప్రవేశిస్తుంది. కుట్టిన చోట కొందరికి నల్లని మచ్చ ఏర్పడుతోంది. కొందరిలో మచ్చ కనబడదు. నొప్పి ఉండదు. కొన్నిరోజుల్లో మచ్చ ఎండిపోతుంది. ఇవి కుట్టిన చోట బ్యాక్టీరియా రక్తంలోకి ప్రవేశించి శరీరమంతా వ్యాపిస్తుంది. మూడు రోజుల నుంచి మొదలై ఆరు లేదా ఏడు రోజులకు పూర్తి లక్షణాలు బయటపడతాయి. మొదట్లో తీవ్రమైన జ్వరం, తలనొప్పి, చలి వంటి లక్షణాలు కనిపిస్తాయి. మలేరియా, టైఫాయిడ్ అనే భ్రమలో ఉన్నవారు స్క్రబ్ టైఫస్ పరీక్ష చేయించుకోవడం ఉత్తమం.

అర్ధ శతాబ్దిలో అపూర్వ కలయిక!

» చౌటపల్లి ఉన్నత పాఠశాల 1975 నాటి ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థుల స్వర్ణోత్సవ వేడుక



చౌటపల్లి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక

గుడివాడ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాలను మరచిపోకుండా గత 50 సంవత్సరాల క్రితం చదువుతున్న ఎస్ఎస్‌సీ పూర్వ విద్యార్థులు తమ మధుర స్మృతులు నెమరువేసుకోవటానికి గోల్డెన్ జూబ్లీ ఉత్సవాన్ని చౌటపల్లి ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించుకున్నారు. 1975లో చౌటపల్లిలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకున్నారు. ఇతర దేశాలు, గుడివాడ, ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న పలువురు ఇక్కడ కలిశారు. తన, మన తారతమ్య బేధం లేకుండా ఆత్మీయ పలుకరింపు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు పర్వతనేని చంద్రశేఖర్, అట్లూరి దేశాయ్, వెన్ననపూడి హైస్కూల్ హెచ్ఎం మాధవకుమార్‌లు గోల్డెన్ జ్యూబ్లీ ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఒకరికొకరు పరిచయాలు చేసుకున్నారు. చౌటపల్లి ఉన్నత పాఠశాలకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరగా, వెంటనే రూ.2లక్షలు వెచ్చించి పాఠశాలకు గ్రిల్స్ ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలను కలసి గత స్మృతులు నెమరువేసుకున్నారు. ఎన్ఆర్ఐ అట్లూరి శోభన్ బాబు, హైదరాబాద్‌లో ఉంటున్న 'ఆంధ్రజ్యోతి'కి అడ్వకేట్‌గా ఉన్న కెవిఎస్.చౌదరి, బెంగళూరులో ఇండియన్ టెలికం ఏజీఎంగా పనిచేసి రిటైర్ అయిన నర్రా జనార్దన్, అట్లూరి భవాని, కె.బాబురావు తదితరులు ఆత్మీయ సమావేశానికి వచ్చి పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. గ్రూపు ఫొటోలు దిగారు.

అదృష్టంగా భావిస్తున్నాను

- కేవీఎస్ చౌదరి



చౌటపల్లి రావటం అదృష్టంగా భావిస్తున్నాను. తల్లిదండ్రులు గుడివాడలో ఉపాధ్యాయులుగా పనిచేశారు. చౌటపల్లిలో ప్రతీ ఇల్లు, ప్రతీఒక్కరిని కలసి చాలా సంతృప్తిని వ్యక్తం చేస్తున్నాను. చౌటపల్లిలో పూర్వవిద్యార్థులను కలవటం ఆనందంగా ఉంది.

అమెరికా నుంచి వచ్చాను

- అట్లూరి శోభన్‌బాబు, ఎన్ఆర్ఐ



1975వ సంవత్సరంలో చదువుకుని ఎక్కడెక్కడో స్థిరపడ్డాం. ఆత్మీయ కలయిక కోసం అమెరికా నుంచి వచ్చాను. నాటి మిత్రులను కలవటం చాలా సంతోషంగా ఉంది. మేము చదువుకున్నప్పుడు పాఠశాల చాలా బాగుండేది. ఈ పాఠశాలకు మంచి వసతులు ఏర్పాటు చేయటానికి కృషి చేస్తాము.

చాలా సంతోషంగా ఉంది

- నర్రా జనార్దనరావు, కె.బాబూరావు





1975 పదో తరగతి బ్యాచ్ అందరం కలుసుకోవటం సంతోషంగా ఉంది. పూర్వ విద్యార్థులు పాఠశాలకు సహాయ సహకారాలు అందిస్తే చౌటపల్లి ఉన్నత పాఠశాల పరిస్థితి మెరుగవుతుంది. ప్రతీఏడాది పాఠశాలలో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకోవటానికి కృషి చేస్తాం. ఎవరు ఎక్కడ ఉన్నా పూర్వ విద్యార్థులందరూ ఒక కుటుంబంలా కలసి ఉంటున్నాము. ఒకరికొకరు సహాయ సహకారాలు అందిస్తూ ప్రశాంత జీవనం గడపటం సంతోషంగా ఉంది.

ఆగని మ్యూటేషన్ మాయ!

(5వ పేజీ తరువాయి)

చెల్లించాలి. దీనికి సంబంధిత వార్డు సచివాలయ అడ్మిన్, మున్సిపల్ రెవెన్యూ అధికారులు ఆమోదించి మున్సిపల్ కమిషనర్‌కు పంపాలి. చివరగా మున్సిపల్ కమిషనర్ లాగిన్ ద్వారా డిజిటల్ సంతకంతో మ్యూటేషన్(ఆస్తి పేరు మార్పు) జరుగుతుంది. ఇది పరిపాటిగా జరిగేదే. గత వైసీపీ హయాంలో భారీ స్థాయిలో ఎటువంటి మ్యూటేషన్ ఫీజులను చెల్లించకుండా ఆస్తి పేర్ల మార్పును విచ్చలవిడిగా చేశారని వినికిడి.

ఆస్తి పన్నుపేరు మార్చిందెవరు?

ఈ ఏడాది జూలై 14వ తేదీన మున్సిపల్ అసెస్మెంట్ నెంబర్లు 1068000993, 1068029649లకు ఉన్న యజమాని పేరు కాకుండా వేరే వ్యక్తి పేరున అక్రమంగా మార్చేశారు. సదరు అసెస్మెంట్‌ల తాలూకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్నును పాత యజమాని చెల్లించేశారు. ఇటీవల ఆస్తి పన్ను కట్టేందుకు వెళ్లిన పాత యజమాని షాక్ గురయ్యారు. తనకు తన అమ్మమ్మ రాసిన రిజిస్టర్డ్ వీలునామా ద్వారా సంక్రమించిన ఆస్తి తాలుకు అసెస్మెంట్ నెంబర్‌లు వేరే వ్యక్తి పేరున మార్చినట్లు గుర్తించారు. తనకు తెలియకుండా తన ఆస్తి వేరే వ్యక్తి పేరున ఎలా మారిందంటూ మున్సిపల్ అధికారులను నిలదీశారు. తమకేమి తెలియదని పేరు మార్పు తమ పరిధిలో జరగలేదంటూ అధికారులు ఎవరికి వారే తప్పించుకోసాగారు. డీఎంఏ కార్యాలయ పరిధిలో జరిగి ఉంటుందని మున్సిపల్ అధికారులు బుకాయించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పన్ను పేరు మార్పు రశీదుతో అక్రమ రిజిస్ట్రేషన్

గుడివాడ మున్సిపాల్టీ నుంచి ఆన్‌లైన్ ద్వారా జారీ అయిన రెండు ఆస్తి పన్ను రశీదుల ద్వారా రూ.1.50 కోట్ల ఆస్తికి ఎసరు పెట్టారు. ఆస్తి పన్ను రశీదును ప్రామాణికంగా, కేవలం నోటి మాట ద్వారా తన ఆస్తిగా చెప్పి అక్రమంగా రిజిస్ట్రేషన్ కూడా జరిగిపోయింది. డాక్యుమెంట్ రైటర్ మాయ చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ కూడా చేయించేశారు. అసలు ఆస్తి వారసులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారం బయటపడింది.

తప్పించుకుంటున్న అధికారులు

గుడివాడ సబ్ రిజిస్ట్రార్ తమ కార్యాలయ పరిధిలో అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిందంటూ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన తప్పులేదంటూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. ఆస్తి పన్ను రశీదుతోనే అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిందని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఇంటి పన్ను పేరు అనధికారికంగా మారిందని గుర్తించామని, హడావిడిగా అక్టోబరు నెలలో పాత యజమాని పేరునే ఇంటి పన్ను కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చేశారు. ఇంటి పన్ను పేరు మార్పు వ్యవహారంలో కార్యాలయంలో అంతర్గత విచారణ చేపట్టలేదనే ఆరోపణలున్నాయి. అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై గానీ, సహకరించిన వారిపైన గానీ, ఇంటిపన్ను పేరు మార్చిన అధికారులపై గానీ చర్యలు తీసుకోలేదు. అసలు విచారణ ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. అనధికారికంగా ఇంటి పన్ను మార్చినట్లు గుడివాడ మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ పేర్కొన్నారు. కానీ దీనికి కారకులెవ్వరనే విషయాన్ని బహిర్గతపరచడం లేదు. తమ కార్యాలయ పరిధిలో జరగలేదంటూ బుకాయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటి పన్ను పేరు మార్పులు ఆయా మున్సిపాల్టీల పరిధిలోనే జరుగుతాయని, దీనికి డీఎంఏకు ఎటువంటి సంబంధం ఉండదని డీఎంఏ అధికారులు పేర్కొన్నారు.

డీఎంఏకు లేఖ రాశాం : కమిషనర్

అనధికారికంగా ఇంటి పన్ను పేరు మార్పు జరిగినట్లు గుర్తించామని, వెంటనే డీఎంఏ దృష్టికి తీసుకువెళ్లి పాత యాజమాని పేరునే ఇంటి పన్ను కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ తెలిపారు. ఇక్కడ అనధికారిక పేరు మార్పు జరగలేదని, తప్పు ఎక్కడ జరిగిందో తేల్చాలంటూ రెండు పర్యాయాలు డీఎంఏకు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. డీఎంఏ కార్యాలయం సీఆర్‌డీఏ కార్యాలయ పరిధిలోకి మారుస్తుండటంతో ఆలస్యమవుతుందని తెలిపారు.

చర్యలు తీసుకోవడంలో అలసత్వం!

గతంలో జరిగిన రూ.60 లక్షల మ్యూటేషన్ కుంభకోణంలో తాడిగడప మున్సిపల్ కమిషనర్‌ను విచారణ అధికారిగా నియమించగా, తూతూమంత్రంగా విచారణ చేపట్టి నివేదికను డీఎంఏ కార్యాలయానికి అప్పగించారు. కానీ నేటికి బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో మరిన్ని అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. తాడిగడప మున్సిపాల్టీ పరిధిలో కూడా భారీ స్థాయిలో మ్యూటేషన్ కుంభకోణం జరిగినట్లు తెలుస్తోంది. సదరు మున్సిపల్ కమిషనర్‌ను నాడు గుడివాడకు విచారణ అధికారిగా నియమించడం పట్ల అప్పట్లో పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి నిజనిజాలను బయట పెట్టాలని కోరుతున్నారు.

ఫిట్‌నెస్‌పై పోరు

(5వ పేజీ తరువాయి)

సారి పెద్ద మొత్తంలో పెంచిన చార్జీలను చెల్లించలేక ఇప్పటికే జిల్లాలో చాలా వరకు లారీలు స్వచ్ఛందంగా నిలిచిపోయాయి. ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని లారీ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సరుకు రవాణాను నిలిపివేసి నిరసన తెలిపేందుకు సమాయత్తమవుతున్నారు.

జిల్లాలో నిలిచిపోనున్న ఐదు వేల లారీలు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రస్తుతం 10,200 లారీలు ఉన్నాయి. వీటిలో 5,150 లారీలు 13 ఏళ్లకు పైబడినవే. సాధారణంగా కొత్త లారీలు నేషనల్ పర్మిట్‌ను కలిగి ఉంటాయి. అవి స్థానికంగా సరుకును రవాణా చేయవు. 13 ఏళ్ల పైబడిన లారీలే స్థానికంగా సరుకు రవాణా చేస్తుంటాయి. ప్రస్తుతం రైతుల నుంచి ధాన్యాన్ని మిల్లర్‌లకు, మిల్లర్‌ల నుంచి బియ్యాన్ని ఎఫ్‌సీఐ గోదాముల వరకు, పలు రకాల పంట ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజీలకు రవాణా చేస్తుంటాయి. ఇవే కాకుండా పోర్టులు, రైల్వే యార్డ్‌ల నుంచి సరుకును స్థానిక వ్యాపారుల వరకు, మార్కెట్‌లకు కూరగాయలు, గుడ్లు, పాలు, బియ్యంతో పాటు నిర్మాణ రంగానికి అవసరమైన ఐరన్, ఇటుకలు, సిమెంట్, సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు తదితరాల రవాణా బాధ్యతను ఈ తరహా లారీలు నిర్వర్తిస్తుంటాయి. ప్రజలకు అవసరమయ్యే ప్రతి వస్తువును ఉత్పత్తిదారుల నుంచి వ్యాపారుల వరకు 13 ఏళ్ల పైబడిన లారీల ద్వారానే రవాణా జరుగుతుంది. గుంటూరు జిల్లాలోని మందడం, ఉండవల్లి తదితర ప్రాంతాల నుంచి ప్రతి రోజూ లారీలు కూరగాయలను విజయవాడ నగరానికి తీసుకొస్తాయి. విశాఖపట్నం నుంచి ప్రతి రోజూ వందకుపైగా లారీలు ఐరన్‌ను తీసుకొస్తాయి. ఎంఎల్ఎస్ పాయింట్‌ల నుంచి రేషన్ షాపులకు బియ్యం, పంచదార, గోదాములను ఈ లారీలే సరఫరా చేస్తాయి. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి పాలను సేకరించి, మిల్క్ ప్రాజెక్టులకు తీసుకెళ్లడం, అక్కడ నుంచి పాల ప్యాకెట్‌లను తిరిగి ప్రజల చెంతకు చేర్చడంలోనూ కీలకంగా వ్యవహరిస్తాయి. అంతేకాకుండా నగరంలోని పేరుగాంచిన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలకు చెందిన లారీలు సైతం 15 ఏళ్లకు పైబడినవే ఉన్నాయి. లారీల బంద్‌తో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే దుస్తులు, పాదరక్షులు, ఇతర వస్తువుల రవాణా ఆగిపోతుంది.

రోజుకు రూ.20 కోట్లకుపైగా నష్టం

లారీలు నిలిచిపోవడంతో రోజుకు రూ.20 కోట్లకుపైగా ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా నష్టపోతారని లారీ యజమానులు చెబుతున్నారు. వస్తువుల కొరత ఏర్పడి పెరిగే ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలను ఆర్థికంగా కుంగదీస్తాయి. అరకొరగా దొరికే కూరగాయలు, నిత్యావసర సరుకుల కోసం ప్రజలు క్యూలో నిలబడే పరిస్థితులు తలెత్తుతాయి. నిర్మాణ రంగం పనులు నిలిచిపోయే అవకాశం ఉండటంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతారు. రైతుల ధాన్యం కల్లాల్లోనే నిలిచిపోయే ప్రమాదం ఉంది. రవాణా శాఖ అధికారుల లెక్కల ప్రకారం ఒక్కో లారీపై 23 కుటుంబాలు ప్రత్యక్షంగా ఆధారపడి ఉంటాయి. లారీ యజమాని నుంచి డ్రైవర్, క్లీనర్‌తో పాటు ఎన్నో సరుకు ఎగుమతి, దిగుమతి చేసే ముఠా కూలీల కుటుంబాలు ఉపాధి కోల్పోతాయి.

అద్దె భవనాలే దిక్కు!

(5వ పేజీ తరువాయి)

జాబితాలు లేదా నివేదికలు తయారు చేసి కౌంటర్ సంతకం పెట్టి కృష్ణా కలెక్టర్‌కు పంపాల్సి ఉంది. వీటిని పరిశీలించి కృష్ణా కలెక్టర్ సంతకాలు చేస్తేనే పరిపాలనా ఆమోదం పొందే పరిస్థితి ఉంది. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లాలో పని చేసే అధికారులు, సిబ్బంది బదిలీల్లో ఎదురైన ఇబ్బందులపై కృష్ణా కలెక్టర్ వద్దకు వచ్చి తమగోడు వెళ్లబోసుకున్నారు.

డివిజన్ స్థాయి వారికి జిల్లా బాధ్యతలు

గతంలో ప్రతిశాఖకు జిల్లాస్థాయి అధికారులు ఉండేవారు. అనుభవం ఉన్న అధికారులు జిల్లాస్థాయిలో పనిచేస్తుంటే వారి పనితీరు, సత్వర నిర్ణయాలు, కిందిస్థాయి అధికారుల పనితీరు, తదితర అంశాలపై పటిష్టంగా పర్యవేక్షణ ఉండేది. ప్రస్తుతం వివిధ శాఖల్లో డివిజన్ స్థాయి అధికారులే, జిల్లాస్థాయి ఇన్‌చార్జి అధికారులుగా పనిచేస్తున్నారు. ఉదాహరణకు ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో గతంలో ఎస్ఈ స్థాయిలో అధికారి ఉండేవారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్‌ల డీఈలు, ఈఈలు ఆయన పరిధిలో పనిచేసేవారు. గతంలో గుడివాడలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయాన్ని మచిలీపట్నంకు ఇటీవలనే మార్చారు. డీఈ స్థాయి అధికారిని ఈఈగా నియమించారు. ఎన్టీఆర్ జిల్లాకు వేరే ఎస్ఈ ఉండటంతో మచిలీపట్నంలోని డీఈ స్థాయి అధికారి ఈఈగాను, ఎస్ఈగాను పనిచేయాల్సిన పరిస్థితి. డీఈ స్థాయిలో ఉన్న అధికారి ఇతర డివిజన్‌లలో ఉన్న డీఈలకు పరిపాలనాపరమైన ఆదేశాలు జారీ చేస్తుంటే వారు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. కృష్ణా పంచాయతీ అధికారి(డీపీవో) పోస్టు కృష్ణాజిల్లాలో అధికారికంగా ఉండగా, ఎన్టీఆర్ జిల్లా డీపీవో పోస్టును మార్చుచేశారు. డ్వామా పీడీ, సంక్షేమ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారుల పోస్టులది ఇదే తీరుగా ఉంది.

ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే..

జిల్లాలో కీలకమైన నీటిపారుదలశాఖ ఎస్ఈ పోస్టును ఎన్టీఆర్ జిల్లా పరిధిలోనే ఉంచారు. విజయవాడ నుంచే ఈ శాఖకు సంబంధించిన పరిపాలన కొనసాగుతోంది. సర్వశిక్ష అభియాన్, గృహ నిర్మాణ శాఖ, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు కార్యాలయం, బీసీ కార్పొరేషన్, అటవీశాఖ, పరిశ్రమలు, ఉద్యానశాఖ, దేవదాయశాఖ, మార్కెటింగ్‌శాఖ, భూగర్భ, గనులశాఖ, ఖనిజశాఖ, భూగర్భ జల అధికారి కార్యాలయం, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్, సహకారశాఖ తదితర కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, మచిలీపట్నం డీవైఈవో కార్యాలయాలను నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న 60 ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలో నడుపుతున్నారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఈఈ కార్యాలయాలను మచిలీపట్నం డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయాన్ని ఉయ్యూరు మార్కెట్ యార్డులోని భవనంలో కొన్ని గదులను అద్దెకు తీసుకుని నడుపుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మాణం చేసేందుకు గత మూడు సంవత్సరాలుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎన్టీఆర్ జిల్లా కృష్ణాజిల్లా నుంచి వేరుపడినట్లుగా చూపి, కృష్ణాపేరుతో కృష్ణాజిల్లాను పాత జిల్లాగా పరిగణిస్తున్నారు. ఆయా కార్యాలయాల భవనాల నిర్మాణానికి ఇంతవరకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. కలెక్టర్, జేసీ కార్యాలయాలను, వారి బంగ్లాలను కొంతమేర ఆధునీకరించి సరిపెట్టారు. గన్నవరం ఎయిర్‌పోర్టు విజయవాడ ఎయిర్‌పోర్టుగానే పిలుస్తారు. ఎన్టీఆర్ జిల్లాకు సమీపంలో ఎయిర్‌పోర్టు ఉంది. కానీ 65 కిలోమీటర్ల దూరంలో ఉండే మచిలీపట్నంలోని కృష్ణా కలెక్టర్, ఎస్పీలు ప్రోటోకాల్, ఇతరత్రాపరిపాలనా పరమైన అంశాలను చూడాల్సి వస్తోంది.

పదో తరగతి పరీక్షల ఫీజు గడువు పెంపు

మచిలీపట్నం టౌన్/విజయవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 9 వరకు గడువు పొడిగించినట్టు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల విద్యాశాఖాధికారి పీవీజే రామారావు, యూవీ సుబ్బారావులు తెలిపారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. రూ.50 ఆలస్య రుసుముతో 12 వరకు చెల్లించేందుకు వీలుంటుందన్నారు. రూ.200ల ఆలస్య రుసుముతో 15 వతేదీ వరకు, రూ.500 ఆలస్య రుసుముతో 18వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. రెగ్యులర్ అభ్యర్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125లు, 3 సబ్జక్టులకు రూ.110లు చెల్లించాలన్నారు. అలాగే సంబంధిత పాఠశాల లాగిన్ https://bse.ap.gov.in,www.bse.ap.gov.inలో ప్రధాన ఉపాధ్యాయుడు లాగిన్ అయి చెల్లించవచ్చన్నారు.



నిందితులను అరెస్టు చేసిన ఇనకుదురు ఎస్ఐ సుబ్రహ్మణ్యం

మందుబాబులపై కేసు నమోదు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనం నడపడమే కాకుండా ప్రశ్నించిన ట్రాఫిక్ సీఐ సున్న రాజీవ్, సిబ్బందిపై అసభ్యంగా మాట్లాడిన ముగ్గురు మందుబాబులపై ఇనకుదురు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. సర్కిల్‌పేట, ఉల్లింగిపాలెం ప్రాంతాలకు చెందిన కొల్లు జీవన్‌సాయి, గుంటూరు శంకర్, బలగం రవితేజవర్మలు శనివారం రాత్రి మద్యం సేవించి బైక్‌పై వస్తుండగా.. ట్రాఫిక్ సీఐ సున్న రాజీవ్ ఆపారు. అయినా లెక్క చేయక అసభ్యంగా మాట్లాడి వెళ్లిపోవడంతో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం గుంటూరు శంకర్, బలగం రవితేజవర్మలను కోర్టుకు హాజరుపరిచారు. కొల్లు జీవన్‌సాయి పరారీలో ఉన్నాడు.



సమావేశంలో మాట్లాడుతున్న వక్కలగడ్డ భాస్కరరావు

ఏపీ ట్రేడ్ హబ్‌కు స్థలం కేటాయించండి

» వక్కలగడ్డ భాస్కరరావు

గాంధీనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ట్రేడ్ హబ్ నిర్మాణానికి అమరావతిలో లేదా ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వర్కింగ్ కమిటీ సమావేశం తీర్మానించింది. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో ఈ సమావేశం ఆదివారం జరిగింది. వ్యాపారస్తుల వ్యాపారాభివృద్ధికి ఏపీ ట్రేడ్ హబ్‌ను 200 ఎకరాల్లో ఏర్పాటు చేయడానికి కమిటీ ఆంగీకరించింది. కొత్త సభ్యుల చేరికను ఆమోదించారు. ఏపీ ఫెడరేషన్ అభివృద్ధికి తమవంతు సహకరిస్తామని సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2026 క్యాలండర్‌ను ఆవిష్కరించారు. సంస్థ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు, ప్రధానకార్యదర్శి పీఎస్ఎల్ఎన్.వరప్రసాద్, ఉపాధ్యక్షులు వంకాయల రామకృష్ణ, బొప్పూడి రామకృష్ణ, ఐ.విజయ్‌కుమార్‌రెడ్డి, వివిధ జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

2025-26 జోలికి వెళ్లొద్దు!

(5వ పేజీ తరువాయి)

సంవత్సరంలో జరిగిన పనుల జోలికి వెళ్లవద్దని సిఫార్సులు చేస్తున్నారు. 2024-2025 నీటి సంవత్సరంలో పనులను పరిశీలించాలని ఒక సూచన చేసినట్టు సమాచారం. దీంతో ఎలా ముందుకు వెళ్లాలో తెలియని పరిస్థితుల్లో విజిలెన్స్ అధికారులు ఉన్నారు. ప్రభుత్వాలతో సంబంధం లేకుండా కాంట్రాక్టర్లు జలవనరుల శాఖలోని పనులను పంచుకుంటున్న విషయం బహిరంగ రహస్యమే. టెండర్ల ప్రక్రియను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నా పనులు మాత్రం తమకు కావాల్సిన కాంట్రాక్టర్లకు జలవనరుల శాఖ అధికారులు కట్టబెడుతున్నారు. విడివిడిగా చేయాల్సిన పనులను ప్యాకేజీలుగా మార్చిలక్షల రూపాయల్లో ఉన్న అంచనా విలువను కోట్లాది రూపాయలకు పెంచుతున్నారు. ఈ ప్రక్రియ నిబంధనలకు విరుద్ధమే అయినా కాంట్రాక్టర్లు ఇచ్చే కాసుల కోసం అధికారులు వాటిని 'నీళ్ల'లో వదిలేస్తున్నారు. తూర్పు డెల్టా పరిధిలో జరిగిన పనులపై అధికార పార్టీ నేత విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయడంతో కాంట్రాక్టర్లు రూటు మార్చారు. స్వయంగా ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి విజిలెన్స్ విచారణను నిలుపుదల చేయించాలని వేడుకున్నట్టు తెలిసింది. కొద్దిరోజుల క్రితం ఫిర్యాదు చేసిన నాయకుడి వద్దకు వెళ్లి ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

టాప్ గేర్!

(5వ పేజీ తరువాయి)

సామర్థ్యంతో 1,056 గృహాలపై ప్యానెల్స్ నిర్మించారు. ప్రజల్లో అవగాహన పెంచి సోలార్ గ్రామాలు నిర్మించే దిశగా డిస్కమ్‌ల ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఆ దిశగా గుడివాడ డివిజన్‌లోని నాలుగు సబ్‌డివిజన్‌ల్లో అధిక విద్యుత్‌ను వాడే వినియోగదారులు సబ్సిడీపై అందిస్తున్న సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడానికి ఉత్సాహం చూపుతున్నారు. దేశవ్యాప్తంగా కోటి గృహాలకు సోలార్ ప్యానెల్స్ అందించాలన్న లక్ష్యంతో కేంద్రం ప్రభుత్వం పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని కోసం సబ్సిడీని అందించడానికి రూ.78వేల కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే.

ప్రచార ఫలితమే..

గుడివాడ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన 1,056 యూనిట్లలో అత్యధికంగా హనుమాన్‌జంక్షన్ సబ్ డివిజన్‌లో 161 గృహాలకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. ఈ సబ్ డివిజన్‌లో వీరవల్లి సెక్షన్ పరిధిలో 125 యూనిట్లు నిర్మించడం విశేషం. దీని తర్వాత గుడివాడ డి2 సెక్షన్‌లో 110 గృహాలకు ఏర్పాటు చేశారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడంతో హనుమాన్‌జంక్షన్ సబ్ డివిజన్‌లో జంక్షన్ సెక్షన్‌లో ఆ ప్రభావం ఎక్కువగా కనిపించింది. సోలార్ ప్యానెల్స్ పంపిణీ చేసే వెండర్స్ కూడా జంక్షన్‌లో ఐదు కంపెనీలు ఏర్పడ్డాయి. రాజకీయ నాయకులు ప్రోత్సాహంతో అత్యధిక సోలార్ ప్యానెల్స్ నిర్మించడానికి దోహదపడిందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నెలకు 90 యూనిట్ల మిగులు

అట్లూరి శ్రీనివాసరావు, హనుమాన్‌జంక్షన్



సోలార్ స్కీం సామాన్య, మధ్య తరగతి, ఎగువ తరగతి గృహ విద్యుత్ వినియోగదారులకు ఉపయోగకరంగా ఉంది. గతంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయకముందు నెలకు రూ.2500 నుంచి రూ.3 వేలు విద్యుత్ బిల్లు వచ్చేది. సోలార్ ఏర్పాటు చేసిన తర్వాత ట్రూ అప్ చార్జీలు తప్ప బిల్లు రాలేదు. గత నెలలో ఇంటికి వినియోగించగా, 90 యూనిట్లు మిగులు వచ్చింది. యూనిట్‌కు రూ2.09 చొప్పున తిరిగి చెల్లించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

టీడీపీ సీనియర్ నేత కంభంపాటి కుటుంబానికి నారా ఇందిర పరామర్శ

గన్నవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపాలెంకు చెందిన టీడీపీ సీనియర్ నేత కంభంపాటి కోటేశ్వరరావు కుటుంబాన్ని నారా రామ్మూర్తినాయుడు సతీమణి నారా ఇందిర ఆదివారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటేశ్వరరావు సతీమణి విజయలక్ష్మీ, కుమారుడు అజయ్ బాబుకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే పలువురు నేతలు, ప్రముఖులు, ఆ కుటుంబాన్ని పరామర్శించారు.



కంభంపాటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నారా ఇందిర



ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో ముక్తేశ్వరస్వామి

పెరికీడులోని ముక్తేశ్వరునికి ప్రత్యేక పూజ

హనుమాన్‌జంక్షన్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెరికీడులోని పంచాయతన క్షేత్రమైన శ్రీ ముక్తికాంత సమేత ముక్తేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అర్చకులు శ్యామ్, మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం ముక్తేశ్వరునికి ఏకాదశరుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనానికి అనుమతిచ్చారు. కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అధికసంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కమిటీ సభ్యులు నక్కా బాబు, నందూరి శర్మ, శ్రీనివాసరావు, రంగరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై శ్రీనివాస్

పౌరజీవనానికి విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

● రౌడీషీటర్లకు ఎస్సై శ్రీనివాస్ హెచ్చరిక

హనుమాన్‌జంక్షన్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలతో పౌర జీవనానికి విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లకు ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు. వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, చట్టవ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన్నా, ప్రోత్సహించినా, నిర్వహించినా సహించేది లేదన్నారు. నేరచరిత్ర కలిగిన వారు భవిష్యత్తులో నేరాల్లో పాలుపంచుకుంటే చట్టప్రకారం శాశ్వతంగా జైలుశిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీషీట్లను తొలగించేందుకు ఉన్నతాధికారులకు తెలియజేసే ప్రయత్నం చేస్తామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి ఎన్నో వ్యయప్రయాసల కోర్చి పండించిన ధాన్యాన్ని నిబంధనల పేరుతో ఇబ్బంది పెట్టకుండా వేగవంతంగా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. ఆదివారం వేలేరు గ్రామంలోని రోడ్లపై ఆరబెట్టిన ధాన్యపురాశుల వద్ద ఆగి ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఆరబెట్టడం ఏమిటంటూ ప్రశ్నించారు. తేమశాతం ఎక్కువగా ఉండటంతో ఆరబెడుతున్నామని, వాతావరణంలో తేమ వల్ల ధాన్యం రోజుల తరబడి ఎండబెట్టాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తేమశాతం విషయంలో నిబంధనలను సడలించేలా చూడాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. మంత్రితో స్వయంగా మాట్లాడతానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే అధికారులతో ఫోన్లో మాట్లాడి క్షేత్రస్థాయిలో రైతు సమస్యలను అర్థం చేసుకుని వ్యవహరించాలని సూచించారు. డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, వేలేరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ అవిర్నేని భవానిశంకర్, రైతులు పాల్గొన్నారు.

కనకవల్లి దాసు కుటుంబానికి పరామర్శ

వేలేరులో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కనకవల్లి దాసు ఇంటికి ఆదివారం వెళ్లిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దాసు చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. అవిర్నేని భవానిశంకర్, కొమ్మారెడ్డి రాజేష్, అట్లూరి రాజశేఖర్, చలసాని శ్రీనివాస్, మలిశెట్టి సుబ్రహ్మణ్యం, కాంతారావు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి

హనుమాన్‌జంక్షన్: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆదివారం తెలుగు మహిళ జిల్లా అధికార ప్రతినిధి వడ్లిల్లి లక్ష్మీకుమారి తన 35వ వివాహ వార్షికోత్సవాన్ని బాపులపాడులోని తన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు నియోజకవర్గ అభివృద్ధికి వడ్లిల్లి లక్ష్మీకుమారి, సత్యనారాయణ దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. అలాగే దాసాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి మరో రూ.75వేలు చెక్కును అందజేశారు. ఈ మేరకు వడ్లిల్లి లక్ష్మీకుమారి దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు, సీనియర్ వైసీపీ నేత దుట్టా రామచంద్రరావు, కూటమి నేతలు చలమలశెట్టి రమేష్‌బాబు, వీరమాచనేని సత్యప్రసాద్, గుండపనేని ఉమావరప్రసాద్, లంక రమేష్, వేగిరెడ్డి పాపారావు, అట్లూరి శ్రీనివాసరావు, కొమ్మారెడ్డి రాజేష్, మొవ్వా వెంకటేశ్వరరావు, జాస్తి భూపతిరావు, మేడేపూడి రామ్మోహనరావు, మొవ్వా వేణుగోపాల్ పాల్గొన్నారు.





వేలేరు వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు రూ.లక్ష చెక్కును అందిస్తున్న వడ్లిల్లి లక్ష్మీకుమారి దంపతులు

ముదునూరులో ఇంటింట సర్వే



ముదునూరులో ఇంటింట సర్వే నిర్వహిస్తున్న వైద్య,ఆరోగ్య సిబ్బంది

ఉయ్యూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముదునూరులో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఆదివారం ఇంటింట సర్వే నిర్వహించి జ్వరం, ఇతర వ్యాధులు, అనారోగ్యంతో ఉన్నవారి గురించి ఇంటింట సర్వే నిర్వహించారు. గ్రామంలో స్క్రబ్‌టైఫస్ బారిన పడి ఒకరు ఈనెల 4న మృతి చెందడం కలకలం రేపింది. జ్వరం, విరేచనాలు, వాంతులతో బాధపడుతూ మచిలీపట్నం, విజయవాడ ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొందిన అతడికి పరీక్షలు చేయగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ అని తేలింది. జిల్లా వైద్యాధికారి పీ యుగంధర్ శనివారం గ్రామంలో పర్యటించి మృతుడి కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకుని, ఇతరులను ఆరాతీసి, మరెవరైనా జర్వం, ఇతర లక్షణాలతో బాధపడుతున్నవారి గురించి గ్రామంలో ఇంటింట సర్వే నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది ఆదివారం 700 గృహాలు సర్వేచేసి 2వేల మందిని ఆరాతీసి వివరాలు సేకరించగా కేవలం నలుగురు మాత్రమే జ్వరంతో బాధపడుతున్నట్టు తేలిందని కాటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ శివరామకష్ణ తెలిపారు.



ఫాదర్ కిషోర్‌తో యూత్ నూతన కమిటీ

ఏసు పట్ల భయభక్తులు కలిగి ఉండాలి

గన్నవరం, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచి ఏసుక్రీస్తు నందు భయభక్తులు కలిగి ఉండాలని విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ నూతలపాటి కిషోర్ అన్నారు. మండలంలోని కేసరపల్లి పునీత అంతోని వారి పుణ్యక్షేత్ర దేవాలయంలో నూతన యూత్ కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ కిషోర్ మాట్లాడుతూ కమిటీ సభ్యులు క్రమశిక్షణతో ఉండాలన్నారు. క్రీస్తు మార్గంలో నడవాలన్నారు. అధ్యక్షుడిగా ఊడిగ కిరణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కూరపాటి అనిల్, కార్యదర్శి మల్లెల సరస్వతి, సహాయ కార్యదర్శి దాకర్ల ప్రసాద్, కోశాధికారి బాపట్ల అవినాష్‌తో కమిటీ ఏర్పడినట్టు ఫాదర్ కిషోర్ తెలిపారు.

నాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి

● గన్నవరం నాట్యకళా మండలి ఆర్గనైజర్ శివయ్య, ఇశ్రాయేలు



బాలనాగమ్మ నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

గన్నవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని గన్నవరం నాట్యకళా మండలి ఆర్గనైజర్ బత్తుల శివయ్య, కొడాలి ఇశ్రాయేలు అన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతి సందర్భంగా భాషా సాంస్కృతిక సౌజన్యంతో కళామ్మ తల్లి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 4 నుంచి 6 రాత్రి వరకు గన్నవరంలోని దళితవాడలో నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివయ్య, ఇశ్రాయేలు మాట్లాడుతూ నాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వాలు సహకారం అందించాలని కోరారు. నాటక రంగంపై ఆధారపడి ఉన్నవారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. శివయ్య ఆధ్వర్యంలో 4న గయోపాఖ్యానం, 5న సత్య హరిశ్చంద్ర, 6న బాల నాగమ్మ, ప్రదర్శనలు కొనసాగాయి. వందలాది మంది ప్రదర్శనకు హాజరయ్యారు.

రూ.100కే వారసత్వ భూముల రిజిస్ట్రేషన్

కంకిపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రూ. 100కే వారసత్వ భూముల రిజిస్ట్రేషన్‌కు కూటమి ప్రభుత్వం అనుమతిస్తూ జీవో జారీ చేయడం హర్షణీయమని టీడీపీ సీనియర్ నేతలు, దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ అతి తక్కువ ధరకే వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం అనుమతిస్తూ జీవో విడుదల చేయడం జరిగిందన్నారు. మార్కెట్ విలువ రూ.10లక్షలలోపున్న భూములకు మాత్రమే ఈ విధానం అమలు అవుతుందన్నారు. ఈ రాయితీ భూ యజమాని మరణించిన తరువాత వారసులకు వచ్చిన ఆస్తులకు మాత్రమే ఈ విధానం వర్తిస్తుందన్నారు. రైతులు, వారసత్వ భూములున్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



డిప్యూటీ ఈవోఆర్డీగా పదోన్నతి పొందిన బాబూజీని సత్కరిస్తున్న పునాదిపాడు టీడీపీ నేతలు

ప్రజల్లోకి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

కంకిపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రజలకు వారధులా పనిచేస్తున్న అధికారులకు ప్రజల్లో ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందని పునాదిపాడు తెలుగుదేశం పార్టీ నేతలు అన్నారు. పునాదిపాడు గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న దివి బాబూ జీకి డిప్యూటీ ఈవోఆర్డీగా పదోన్నతిపై వెళ్లడంతో స్థానిక టీడీపీ నేతలు ఆదివారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రజల్లోకి బాబూ జీ తీసుకువెళ్లారని కొనియాడారు. కాసరనేని కరుణ కుమార్, కర్రా కిషోర్, గుంజులూరి నాగ అనీల్, మునిబోయిన బాబు, సాదం రాఘవ, మట్టా రవి, సుంకేసుల కాశీ ప్రసాద్ పాల్గొన్నారు.

అనుమోలుకు ఔట్‌స్టాండింగ్ ప్రెసిడెంట్ అవార్డు

పెనమలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్వతారోహకుడు, టీడీపీ సీనియర్ నేత, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ వీఆర్కే వాణిజ్య అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావును లయన్స్ గవర్నర్ గద్దె శేషగిరి స్పందన లయన్స్ క్లబ్ అవార్డు ఫంక్షన్‌లో ఔట్‌స్టాండింగ్ ప్రెసిడెంట్‌గా అవార్డును అందజేశారు. తాడిగడప వందడుగుల రోడ్డులోని అన్నే వారి కల్యాణమండపంలో ఆదివారం జరిగిన లయన్స్ క్లబ్ కార్యక్రమంలో ఇటీవల ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించిన అనుమోలుకు అభినందనలు తెలిపారు. పూర్వ గవర్నర్ గద్దె శేషగిరితో పాటు ప్రస్తుత గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు, గత మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ శివశంకర్, దామర్ల శ్రీశాంతి, ఎం రామారావు, డీసీటీ ఈశ్వర్, వాణిజ్య సభ్యులు సంజీవరావు, గద్దె విజయలక్ష్మి, జానకీరామ్ పాల్గొన్నారు.

పాలడుగుకు ఎమ్మెల్యే బోడె అభినందనలు



సత్యనారాయణను అభినందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముదునూరు ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం మాజీ అధ్యక్షుడు పాలడుగు సత్యనారాయణను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అభినందించారు. సంఘం నూతన అధ్యక్షుడిగా పాలడుగు పేరు ప్రతిపాదించడంపై పలువురు టీడీపీ నేతలు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలలిపారు. సంఘం అధ్యక్షుడిగా త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో పార్టీ మండలాధ్యక్షుడు కుటుంబరావు, మాజీ సర్పంచ్ జ్ఞానశేఖర్, నాగరాజు, రవితేజ, మహేశ్, చిన ఓగిరాల పీఏసీఎస్ అధ్యక్షుడు పాలడుగు రామకృష్ణ, సాయి, మహేశ్ ఇతర నేతలతో కలిసి సత్యనారాయణ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో సంఘ అధ్యక్షుడిగా మరోసారి అవకాశం కల్పించడంపై ధన్యవాదాలు తెలిపారు.

కేసీపీ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



ఉయ్యూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలం పాటు కలిసి పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం ఎక్కడెక్కడో స్థిరపడి అందరూ కలిసి గతస్మృతులు గుర్తుచేసుకుని, సత్కరించి గౌరవించడం అభినందనీయమని ప్రముఖ సీనియర్ వైద్యుడు శివరామకృష్ణయ్య అన్నారు. కేసీపీ చక్కెర కర్మాగారంలో వ్యవసాయ విభాగంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పలువురు ఆదివారం కలుసుకుని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. శివరామకృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని 75 ఏళ్ల వయసు నిండిన ప్రభాకర్‌రావు, ఆంథోని, సుబ్రమణ్యేశ్వరరావు, శ్రీరామకృష్ణ, వెంకటేశ్వరరావు, ప్రతాప్‌రావు, సత్యనారాయణను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మేరుగ సత్యనారాయణ, వీర కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రాంబాబురెడ్డి, కోడె సాంబశివరావు, సూర్యనారాయణ, కృష్ణమోహనరావు సభ్యులు సేవలందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

ఘనంగా కొండాలమ్మకు పొంగళ్లు

గుడ్లవల్లేరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. దాదాపు పదివేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారని ఆలయ ఈవో కొండలరావు తెలిపారు. పాల పొంగళ్లు వండి కొండాలమ్మ అమ్మవారికి సమర్పించి భక్తులు మొక్కులను చెల్లించుకొని దర్శించుకొన్నారు. ఈనెల తొమ్మిదవ తేది మంగళవారం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకల హుండీల లెక్కింపు నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొనే అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు.


డప్పులతో అమ్మవారిగుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుడివాడ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లు, అనుమానిత షీట్ ఉన్నవారు మంచి ప్రవర్తనతో ఉండి తమపై ఉన్న రౌడీషీట్‌లను తొలగించుకోవాలని గుడివాడ రూరల్ ఎస్సై ఎస్.చంటిబాబు అన్నారు. ఆదివారం స్థానిక గుడివాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు, డీఎస్పీ ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానిత షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చామని ఎస్సై తెలిపారు.

గుడివాడ రూరల్: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, జాగ్రత్తగా తమ వాహనాలు నడపాలని ఎస్సై చంటిబాబుకోరారు. ఆదివారం వేగంగా వెళ్తున్న వాహనాలను ఆపి వాగహనదాలను మందలించారు.

ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వరరావు మృతి

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డ ఇరిగేషన్ కార్యాలయం ఏఈగా పని చేస్తున్న పులిగడ్డ వెంకటేశ్వరరావు(55) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ తదితరులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఈఈ రావెళ్ల రవికిరణ్, ఇరిగేషన్ డీఈ గణపతి, డీసీ సంఘాల చైర్మన్‌లు నిడమానూరి దిలీప్ కుమార్, బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, భానుప్రకాష్, ఆర్ అండ్ బి డీఈ రమేష్, ఉద్యానశాఖ అధికారి రమేష్, నీటి సంఘం అధ్యక్షులు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సాహిత్యంలో నాటక ప్రక్రియకు ఎంతో ఆదరణ

మచిలీపట్నం టౌన్ : తెలుగు సాహిత్యంలో నాటక ప్రక్రియకు ఎంతో ఆదరణ ఉందని ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అన్నారు. భావతరంగిణీ ఆధ్వర్యంలో మహతి కళావేదికపై భవిష్య రచించిన అభినయ సాంఘిక నాటకం పుస్తకాన్ని గుత్తికొండ సుబ్బారావు, సాహితీవేత్త డాక్టర్ ధన్వంతరీ ఆచార్య, భావతరంగిణి గౌరవాధ్యక్షుడు కె. కృష్ణమోహనరావు, లంకిశెట్టి బాలాజీ ఆవిష్కరించారు. అనంతరం నాటకాన్ని ప్రదర్శించారు. రచయిత భవిష్య దర్శకత్వం వహించారు. పి.శాంతి త్రిపాత్రాభినయం చేశారు. 80 ఏళ్ల నాయనమ్మగా, 50 ఏళ్ల తల్లిగా, 20 ఏళ్ల కుమార్తెగా నటించారు. మరోపాత్ర ధారి రావినూతల సత్యనారాయణ పాలబ్బాయిగా, పాత్రికేయుడిగా, పద్మనాభరావుగాత్రిపాత్రాభినయం చేశారు. దండిభొట్ల దత్తాత్రేయశర్మ నాట్యాచారుడిగా, యల్లాప్రగడ శ్రీరామ్ సినీ డైరెక్టర్‌గా, ఆర్. వెంకటేశ్వరరావు హాస్యనటునిగా నటించారు. డాక్టర్ ధన్వంతరీ ఆచార్య సాహితీవేత్తగా, వైద్యుడిగా నటించారు. అద్దేపల్లి సత్యమల్లిఖార్జునప్రసాద్ హీరోగా, కోసూరి ఈశ్వరరావు కవిగా, వై. హరిణి కూచిపూడి నర్తకిగా, కౌండిన్య దత్ బాలనటుడిగా తమ పాత్రలకు న్యాయం చేశారు. కొప్పరపు నారాయణ మూర్తి, బి.వి.వి. సత్యనారాయణ, గుడిపూడి రాధికారాణి, అప్పినీడి పోతురాజు, పెద్దిరాజు, పాల్గొన్నారు.

లే అవుట్లు వేశారు .. వసతులు మరిచారు

- దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

(కూచిపూడి - ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో కనీస మౌలిక వసతులు లేకపోవటంతో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేందుకు నేటికీ ముందుకు రావటం లేదు. మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా, 13 లేఅవుట్లలో 2104 ప్లాట్లు కేటాయించగా, 326 గృహాలు మాత్రమే లబ్ధిదారులు నిర్మించారంటే పరిస్థితి ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఆవిరిపూడి, అయ్యంకి, భట్లపెనుమర్రు, కాజ, కొండవరం, కోసూరు, కూచిపూడి, మంత్రిపాలెం, మొవ్వ, నిడుమోలు, పెదముత్తేవి, పెడసనగల్లు, వేములమడ గ్రామా ల్లో మాత్రమే లే అవుట్లు వేశారు. వీటిలో 326 గృహాలు పూర్తి కాగా, 83 గృహాలు బేస్‌మెంట్ లెవల్‌కు, 36 గృహాలు రూఫ్ లెవల్ స్థాయిలో వివిధ దశల్లో ఉన్నాయి. ఈ లేవుట్లలో తాగునీరు, విద్యుత్, ప్లాట్లు మెరక చేయటం, అంతర్గత రహదారి సౌకర్యాలు లేకపోవటంతో గృహాలు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రాని పరిస్థితులు ఏర్పడ్డాయి. కాలనీల్లో పిచ్చిమొక్కలు అల్లుకుపోయి పగలే పాములు సంచరిస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. పెదపూడి జగనన్న కాలనీలో నేటికీ అంతర్గత రహదారులు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యాలు లేని పరిస్థితుల్లో కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. కాలనీ వాసులు రెండు కిలోమీటర్లు వెళ్లి కూచిపూడి పోలీస్ స్టేషన్ సమీపంలో తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కూచిపూడి జగనన్న కాలనీలో పిచ్చిమొక్కలు అల్లుకుపోయి పగలే పాములు సంచరిస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. తాగునీరు సౌకర్యం లేకపోవటం, అంతర్గత రహదారులు అస్తవ్యస్తంగా ఉండటంతోపాటు వీధి లైట్లు వెలగకపోవటంతో కాలనీ వాసులు బిక్కుబిక్కుమంటున్నారు. చినముత్తేవిలో శ్మశాన వాటిక సమీపంలో ప్లాట్లు కేటాయించగా, గ్రామస్థులు తిరస్కరించటంతో మరోచోట కేటాయింపులు నేటి వరకు చేయకపోవటంతో గ్రామస్థులు ఇటీవల కలెక్టర్ డికె.బాలాజీని కలసి వినతిపత్రం అందజేశారు. 21 గ్రామపంచాయతీల్లో 13 లే అవుట్ల ద్వారా ప్లాట్లు కేటాయించినప్పటికీ అన్ని చోట్ల మౌలిక వసతులు కరువయ్యాయి. ప్లాట్ల కోసం స్థలాలు కొనుగోలు చేసే విషయంలోనూ, ప్లాట్లు మెరక చేసి అభివృద్ధి చేసే విషయంలోనూ పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకున్నట్లు, ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారుల పాత్ర ఉన్నట్లు అప్పట్లో జోరుగా విమర్శలు చోటు చేసుకున్నాయి.


అంతర్గత రహదారులు లేక అధ్వానంగా పెదపారుపూడి జగనన్న కాలనీ


పిచ్చిమొక్కలతో అల్లుకుపోయిన కూచిపూడి జగనన్న కాలనీ

బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాం



పెదపూడి జగనన్న కాలనీలో కనీస వసతులు లేకపోవటంతో రాత్రిళ్లు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాం. వర్షం వస్తే రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. నేటికీ పలు రహదారులకు విద్యుత్ సౌకర్యం లేదు. రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

సుభాషిణి, పెదపూడి కాలనీ వాసి

పగలే పాములు సంచరిస్తున్నాయి



కాలనీలో పిచ్చిమొక్కలతో అల్లుకుపోయి పగలే పాములు సంచరిస్తున్నాయి. వీధి లైట్లు వేసే వారు కరువయ్యారు. అంతర్గత రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. తాగునీటి సౌకర్యం లేదు. కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాము.

అనన్య, కూచిపూడి కాలనీ వాసి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ ప్రతినిధులు

దుప్పట్ల పంపిణీ

గుడ్లవల్లేరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం,దుప్పట్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. రేమల్లె లక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమార్తెలు పూర్ణిమ, రాధిక, ప్రతిభల సౌజన్యంతో నిరుపేద వృద్ధులకు అన్నదానం, దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో జంగం మోహనరావు, జంగం సతీష్, పోలవరపు వెంకటరావు, ఉచ్చుల రవికుమార్, సూరపనేని పరందామయ్య, చాపరాల రాజేశ్వరరావు,చాపరాల బాలాజీ, క్లబ్ అధ్యక్షుడు పెరుమాళ్ళు పాల్గొన్నారు.

వైభవంగా వేదపారాయణ

కూచిపూడి : కూచిపూడి గంగా బాల త్రిపుర సుందరీ దేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన వేద పారాయణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆర్షియ విద్యాపరిశోధన పరిషత్ అధ్యక్షుడు కప్పగంతు వెంకట శివసీతారామ శాస్త్రి పర్యవేక్షణలో వేదపండితులు, ఘనాపాటిల సారథ్యంలో ఆహ్లాదకర వాతావరణంలో సాగిన వేదపారాయణం శ్రవణానందకర ంగా కొనసాగింది. విశ్రాంత ఉపాధ్యాయులు చింతలపాటి రామకృష్ణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించగా, పలువురు ఔత్సాహికులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌తో అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారి టి.రాజేష్

పామర్రు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్‌టైఫస్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా మెలగాలని మండల వైద్యాధికారి టి.రాజేష్ సూచించారు. జిల్లా వైద్యాధికారి పి.యుగంధర్ ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక 19వార్డులోని కొరముక్కువానిపురానికి చెందిన ఓమహిళ వారి పుట్టింటి గ్రామమైన గుడ్లవల్లేరు ఉండగా జ్వరం రావడంతో వైద్యపరీక్షలు నిర్వహించగా స్క్రబ్‌టైఫస్ పాజిటివ్‌గా తెలినట్లు అక్కడి వైద్యులు సమాచారం అందించారన్నారు. అయితే ఆమె ఆరోగ్యం పూర్తిగా నిలకడగానే ఉందని ఆందోళన చెందవలసిన అవసరం లేనప్పటికి ముందు జాగ్రత్తలో భాగంగా కోరముక్కువానిపురంలో గల 54 ఇండ్లలో ఆదివారం కనుమూరు పీహెచ్‌సీ పరిధిలోని వైద్య ఆరోగ్య సిబ్బంది చేత ఇంటింటా ఫీవర్ సర్వే చేయించామన్నారు. ఎవరికి అలాంటి వ్యాధిలక్షణాలు కనిపించలేదని స్పష్టంచేశారు. ముఖ్యంగా గ్రామీణ, నగరాల్లో పొదలు అధికంగా ఉండే ప్రాంతాల్లో నల్లిమాదిరిగా ఉండే పురుగులు కుట్టడం ద్వారా ఈవ్యాధి సోకుతుందని గ్రహించాలన్నారు. పురుగు కుట్టిన వారికి జ్వరం, వణుకు, తలనొప్పి, కండరాల నొప్పి, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యులను కలవడం ఎంతో మంచిదన్నారు. ఆరంభంలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే మనిషికి ఎలాంటి ప్రమాదం ఉండబోదని రాజేష్ వెల్లడించారు. వ్యాధి నిర్ధారణకోసం మచిలీపట్నం ఆసుపత్రిలో వెంటనే పరీక్షలు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు సారథి, తుంగల వేణు, ఏఎన్‌ఎంలు డి.రోహిణి, పి.విజయభాను, కమల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

నిడుమోలు-కౌతవరం రహదారికి మరమ్మతులు

గుడ్లవల్లేరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కౌతవరం - నిడుమోలు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి నిర్మాణం ఏళ్ల తరబడి ఆ రహదారిలో ప్రయాణించే ప్రయాణికులకు, డోకిపర్రు, పెసరమిల్లి ప్రాంత ప్రజలకు తీరని కోర్కెగా నాలుగేళ్ల నుంచి ఉంది. 2023లో నిలిచి పోయిన పనులు 2024 మధ్యలో ప్రారంభించి మధ్యలోనే నిలిపి వేశారు. ఈ రహదారి పనులను గత మూడు రోజులుగా యుద్ధప్రాతిపదికన నిర్మాణం చేస్తున్నారు. రాత్రింబగళ్లు అధునాతన యంత్రాల సాయంతో పనులు వేగవంతంగా నిర్మిస్తున్నారు. గతేడాది ఇదే రోజుల్లో సీఎం చంద్రబాబు నాయిడు డోకిపర్రు వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చినపుడు మేఘా ఇంజనీరింగ్ సంస్థ అధినేత పీ.వీ.కృష్ణారెడ్డి కి పీ4 గురించి వివరించగా ఆయన గుడ్లవల్లేరు మండలాన్ని దత్తత తీసుకొంటానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో నిడుమోలు-కౌతవరం ప్రధాన రహదారి నిర్మాణం ఎట్టకేలకు పూర్తవుతుండటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


డోకిపర్రు వద్ద పూర్తయిన రహదారి నిర్మాణ పనులు


డోకిపర్రు వద్ద కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులు

ఘనంగా లక్ష బిల్వార్చన

పామర్రు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పామర్రులో వేంచేసి యున్న గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం పామర్రు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేక సహిత లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణ సంఘ నేతలు బోతనబొట్ల పణింద్ర శర్మ, కిరణ్, దుర్గాప్రసాద్, లంక బిష్మాకుమార్ పావన్ శాస్త్రీల పర్యవేక్షణలో స్వామికి రుద్రహోమం సహస్ర కుంకమార్చన చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో బ్రాహ్మణ సంఘీయులకు మార్గశిరమాస ఆరుద్ర నక్షత్ర ఉత్సవాన్ని పురస్కరించుకుని అన్న సమారాధన చేశారు. రాత్రిసమయంలో శివజ్యోతులను వెలిగించారు. పార్వతీ అమ్మవారికి సహస్ర నామార్చనలు చేశారు. స్థానిక అంకమ్మతల్లి దేవస్థానంలోని రేణుకా పరమేశ్వరి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ విశాలక్ష్మి , తుర్లపాటి హనుమంతురావు, తంగెళ్ల ప్రసాద్, టీఎలెకె ప్రసాద్, పి.సురేంద్రకుమార్ తదితర ప్రముఖులతోపాటుగా, గ్రామస్థులు పాల్గొన్నారు.


శివాలయంలో బిల్వార్చనలో పాల్గొన్న అర్చకులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గుడ్లవల్లేరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో స్క్రబ్ టైపాస్ వైరెస్ సోకిన వ్యాధిగ్రస్థులు ఉండటంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అయితే వ్యాధి అంటువ్యాధి కాదని, ముందుగానే వైద్యుల వద్దకు వెళితే వ్యాధి నయమౌతుందని కంగారు లేదని వైద్యులు చెబుతున్నారు. కాగా ఆదివారం గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ అధికారులు తక్షణ చర్యగా గ్రామమంతా పారిశుధ్యపనులు ముమ్మరం చేశారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వీధుల్లో ఎక్కడా చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేశారు. డ్రెయిన్లలో దోమల వృద్ధి నివారణకు సైతం చర్యలు తీసుకున్నారు. పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ పర్యవేక్షించారు.


ఇందిరా కాలనీలో బ్లీచింగ్ చల్లుతున్న కార్మికులు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఒక్కరోజు ఆదాయం రూ.9,97,952

మోపిదేవి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పుట్టలో పాలు పోసి, పూజలు చేశారు. నాగవల్లి వృక్షానికి ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వివిధ సేవా రుసుముల ద్వారా ఆదివారం ఒక్కరోజే రూ.9,97,952 ఆదాయం వచ్చినట్లు ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

గుడివాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : గుడివాడ వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గంటా చంద్రశేఖరరావు, కార్యదర్శిగా లక్ష్మీనారాయణరెడ్డి, కోశాధికారిగా బాలభాస్కర్‌లతో కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఆదివారం స్థానిక కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో 44మంది కార్యవర్గ సభ్యులతో జిల్లా గవర్నర్ సనకా సుబ్బారావు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు జి.బాబు శ్రీకర్, ప్రసాద్, రామకృష్ణ, చిన్నం గంగాధర్, నారాయణరెడ్డి, తిరుపతయ్య, చంద్రశేఖరరావు, ఎంఆర్ ప్రసాద్, సి.హెచ్ మల్లిక్, డి.వి. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


తాడంకి కార్యదర్శి భవానీని సత్కరిస్తున్న గ్రామస్థులు

డిప్యూటీ ఎంపీడీవోకు సత్కారం

పమిడిముక్కల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాడంకి పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేస్తున్న ఇస్లావత్ భవాని డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొందిన నేపథ్యంలో సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఇన్‌చార్జ్ కార్యదర్శి నాగులుమీరా యూఎఫ్‌ఆర్‌టీఐ రాష్ట్ర కో-కన్వీనర్ జంపాన శ్రీనిసగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. భవానీని ఏకొండూరు ఎంపీడీవోగా నియమిస్తూ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు. పంచాయతీ కార్యదర్శిగా భవానీ సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. సామాజిక కార్యకర్తలు సాకే రాములమ్మ, సాంబశివరావు, సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు

గుడివాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బస్సు పథకంతో ఆర్టీసీ బస్టాండ్ మహిళలతో నిండిపోయింది. పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు, మాలదారులు బస్సుల కోసం వేచి ఉన్నారు. అధిక సంఖ్యలో వచ్చిన ప్రయాణికులకు బస్సులను సమకూర్చడంలో ఆర్టీసీ డిపో అధికారులు విఫలమయ్యారు. అందుబాటులో ఉన్న సర్వీసు బస్సుల్లో సైతం సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కారు. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు.


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్

ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి

మోపిదేవి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ తెలిపారు. పెదప్రోలులో జాతీయ రహదారి వెంబడి ధాన్యం ఆరబెట్టుకున్న రైతులతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, రైతు సేవా కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, జనసేన అధ్యక్షుడు పూడషపు రత్న గోపాల్, చందన రంగారావు, బాచు శ్రీనివాసరావు, కోసూరు శివాజీ, డోకిపర్తి బాలకోటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ మెరకనపల్లి నరేష్, యడ్లపల్లి లక్ష్మణరావు (బుజ్జి), కూరేటి రాఘవ, మద్దాల రమణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఎస్పీ ధీరజ్ వినీల్


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

కూచిపూడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. కూచిపూడి సీతారామ ఫంక్షన్ హాలులో గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 525 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీనియర్ ఆర్థోపెడిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ ఎం.వి.హరిప్రసాద్, డాక్టర్ కెవి.రామకిషోర్, డాక్టర్ కృష్ణ వశిష్ట, డాక్టర్ ఎన్.వేణు, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, కంటి వెన్నుముక్క పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 3 వేలు విలువ గల ఎముకల ధృడత్వాన్ని నిర్ధారించే పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు,శంతన కుమార్, పామర్రు సీఐ వి.శుభాకర్, కూచిపూడి ఎస్సై శిరీష పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక కోతిబొమ్మసెంటర్‌లోని డాక్టర్ ప్రభావతి గార్డెన్స్‌లో డాక్టర్ టి.లక్ష్మీ పెరుమాళ్ల, టి.ప్రభావతి, చలసాని రాయన్ చౌదరిల జ్ఞాపకార్థం రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పెదఅవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యులు డాక్టర్ హర్షిత, డాక్టర్ రేవతిలు వైద్యసేవలందించారు. ఈ శిబిరంలో ఎముకలు, కీళ్లల, గుండె, మధుమేహానికి సంబంధించి ఆయా వైద్యులు 45మంది రోగులను పరీక్షించి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రోగ్రాం కన్వీనర్లు డాక్టర్ సి.సూర్యచంద్రరావు, కిరణ్‌బాబు, క్లబ్ పూర్వాధ్యక్షుడు ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎ.మారుతీ కుమార్, ఎ.జె. ప్రసాద్, ఎస్.ఉదయభాస్కరరాజు, నర్సింగ్ హెడ్ జి.వి రాఘవమ్మ పాల్గొన్నారు.


గుడ్లవల్లేరులో..


గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ..

గుడ్లవల్లేరు : డాక్టర్ సీఎల్ వెంకట్రావు జన్మభూమి మెడికల్ సెంటర్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ హరిహరన్ మానసిక సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విజయవాడ కామినేని ఆసుపత్రి వారు గుండె, నేత్ర, ఆర్థో, దంత సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ సీఎల్ వెంకట్రావు గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సాధారణ వ్యాధులను పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 158 మంది రోగులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఒక్కరోజు ఆదాయం రూ.9.97 లక్షలు



మోపిదేవి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి పుట్టలో పాలు పోసి, స్వామివారిని దర్శించుకున్నారు. నాగవల్లి వృక్షానికి ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సేవా రుసుముల ద్వారా ఆదివారం ఒక్కరోజే రూ.9,97,952 ఆదాయం వచ్చినట్లు ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఆలయ సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆదర్శవంతమైన ప్రవర్తన కలిగి ఉండాలి

● కేంద్రీయ విద్యాలయం వార్షికోత్సవంలో కలెక్టర్ డీకే బాలాజీ ఉద్బోధ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని కలెక్టర్ బాలాజీ అన్నారు. పీఎం కేంద్రీయ విద్యాలయం వార్షికోత్సవం ఆదివారం జరిగింది. కలెక్టర్ బాలాజీ ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, తల్లిదండ్రులు ఆదర్శవంతమైన ప్రవర్తన కలిగి ఉంటే పిల్లలు సత్పౌరులుగా ఎదుగుతారన్నారు. చికాగోకు చెందిన బూచ్ వహారా జీవిత చరిత్రను కలెక్టర్ వివరించారు. విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ అహమ్మద్ అసీఫ్ హుస్సేన్ అధ్యక్షత వహించారు.





కేంద్రీయ విద్యాలయం వార్షికోత్సవంలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన, మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ, పక్కన ప్రిన్సిపాల్ అసిఫ్ హుస్సేన్



పైడమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దంపతులు

నాల్గోరోజుకు పైడమ్మ జాతర

పెడన, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పైడమ్మ సంబరానికి ఆదివారం, నాలుగోరోజు భక్తులు పోటెత్తారు. శిడిబొమ్మల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఈవో జీ.వి. కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, పాలక మండలి సభ్యు లు పటిష్ఠమైన ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, శిరీష దంపతులు ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో జీ.వి. కృష్ణారావు, ఆశాది దాసు శ్యామ్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకటనగేష్, పట్టణ టీడీపీ నాయకుడు యక్కల శ్యామలయ్య, చందన నారాయణరావు, కమ్మగంటి బాబు, పరసా జితేంద్ర, ఎలిగట్ల ప్రసాద్ తదితరులు ఉన్నారు.



కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న లంకిశెట్టి బాలాజీ, గడ్డం రాజు తదితరులు

వడ్రంగి వృత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా కాంతారావు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వడ్రంగి వృత్తిదారుల సంఘం కార్యాలయానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని అధ్యక్షుడు కాంతారావు డిమాండ్ చేశారు. జగన్నాథస్వామి దేవాలయంలో వడ్రంగి వృత్తిదారుల సంఘం కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. సంఘం గౌరవాధ్యక్షుడు గడ్డంరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా కొరగంటి కాంతారావు, ప్రధాన కార్యదర్శిగా పరసా లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ నాయకులు వడ్రంగి పనివారల సమస్యలను వివరించారు. సంఘం న్యాయ సలహాదారు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, 500సభ్యులున్న వడ్రంగి పనివారలకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలన్నారు. కార్మిక శాఖ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. గౌరవాధ్యక్షుడు గడ్డంరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం చేతి వృత్తుల వారికి ప్రభుత్వం రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తోందన్నారు.



పర్యాటకులకు సూచనలు చేస్తున్న మెరైన్ ఎస్సై ఉజ్వల్

రాకాసి అలలు వస్తుంటాయి జాగ్రత్త!

కోడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో రాకాసి అలలు వస్తుంటాయని, స్నానాలు చేసేటప్పుడు పర్యాటకులు జాగ్రత్త వహించాలని పాలకాయితిప్ప మెరైన్ ఎస్సై ఉజ్వల్ సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి హంసలదీవి బీచ్‌కు విచ్చేసిన పర్యాటకులకు పలు సూచనలు, సలహాలు అందించారు. సముద్రంలో గుంతలు ఉంటాయని హెచ్చరించారు. వృద్ధులను, పిల్లలను ఒంటరిగా సముద్ర తీరంలో వదలరాదని హెచ్చరించారు. తీరం వెంబడి మెరైన్ సిబ్బంది గస్తీ నిర్వహించారు.

బయటి వ్యక్తులతో అలజడి సృష్టించటం సిగ్గుచేటు : కొల్లూరి

అవనిగడ్డ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా శనివారం మోపిదేవిలో జరిగిన సమావేశంలో బయటి పార్టీల వ్యక్తులను తీసుకొచ్చి అలజడి సృష్టించటం సిగ్గుచేటని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదు మండలాల నేతలు ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసుకుంటే, అవనిగడ్డ మండలంలో మాత్రం పార్టీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న ఓ నేత జనసేన, వైసీపీల వారితో వచ్చి భయానక వాతావరణం సృష్టించడం సిగ్గు చేటని అన్నారు. తాము పొత్తు ధర్మాన్ని పాటించి కూటమిలోని మిగిలిన పార్టీల అంతర్గత వ్యవహారాల్లో ఎన్నడూ తలదూర్చలేదన్నారు. సదరు నేత ఇతర పార్టీల వారి ని వెంట వేసుకుని పార్టీ సానుభూతిపరులను బెదిరించాలని చూ డటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ విషయంపై పార్టీ క్రమశిక్షణ సంఘానికి ఫిర్యాదు చేస్తామని అన్నారు. టీడీపీ నేతలు బండే రాఘవ, పరుచూరి దుర్గా ప్రసాద్, కర్రా సుధాకర్, అడపా శ్రీనివాస్, ఆనంద్, కొల్లూరి వాసు తదితరులు పాల్గొన్నారు.



సెమీక్రిస్మస్ వేడుకల్లో చిన్నారుల నృత్య ప్రదర్శన

ఎల్ఈఎఫ్ చర్చిలో ఘనంగా సెమీక్రిస్మస్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఈఎఫ్ చర్చిలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ ఘనంగా జరిపారు. సంఘ కాపరి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విజయవాడకు చెందిన బ్రదర్ ప్రియనాథ్ ప్రసంగించారు. ఏసుక్రీస్తు అల్పులు, ఘనులు, అజ్ఞానులకు రక్షకుడిగా ఉన్నారన్నారు. చర్చిని క్రిస్మస్ ట్రీ, స్టార్లతో అంగరంగ వైభవంగా అలంకరించారు. సండే స్కూల్ పిల్లలు పాడిన గీతాలు, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. నగర ప్రముఖులు, పాల్గొన్నారు.

కోకిలాంబకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పరామర్శ

ఘంటసాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సంఘ సంస్కర్త గుత్తికొండ కోకిలాంబను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం రాత్రి పరామర్శించారు. చినకళ్లేపల్లి గ్రామానికి చెందిన కోకిలాంబ గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఇం టికే పరిమితమయ్యారు. కోకిలాంబ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మండలి బుద్ధప్రసాద్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మాలెంపాటి సుధాకర్, కొడాలి వెంకట సుబ్బారావు (బుజ్జి), కనగాల భాస్కరరావు, గుత్తికొండ సుబ్బారావు, యలమంచిలి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంలో నాటక ప్రక్రియకు ఎంతో ఆదరణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్యంలో నాటక ప్రక్రియకు ఎంతో ఆదరణ ఉందని ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అన్నారు. భావతరంగిణి ఆధ్వర్యంలో మహతి కళావేదికపై భవిష్య రచించిన అభినయ సాంఘిక నాటకం పుస్తకాన్ని గుత్తికొండ సుబ్బారావు, సాహితీవేత్త డాక్టర్ ధన్వంతరీ ఆచార్య, భావతరంగిణి గౌరవాధ్యక్షుడు కె. కృష్ణమోహనరావు, లంకిశెట్టి బాలాజీ ఆవిష్కరించారు. అనంతరం నాటకాన్ని ప్రదర్శించారు. రచయిత భవిష్య దర్శకత్వం వహించారు. పి.శాంతి త్రిపాత్రాభినయం చేశారు. 80 ఏళ్ల నాయనమ్మగా, 50 ఏళ్ల తల్లిగా, 20 ఏళ్ల కుమార్తెగా నటించారు. మరోపాత్ర ధారి రావినూతల సత్యనారాయణ పాలబ్బాయిగా, పాత్రికేయుడిగా, పద్మనాభరావుగాత్రిపాత్రాభినయం చేశారు. దండిబొట్ల దత్తాత్రేయశర్మ నాట్యాచారుడిగా, యల్లాప్రగడ శ్రీరామ్ సినీ డైరెక్టర్‌గా, ఆర్. వెంకటేశ్వరరావు హాస్యనటునిగా నటించారు. డాక్టర్ ధన్వంతరీ ఆచార్య సాహితీవేత్తగా, వైద్యుడిగా నటించారు. అద్దేపల్లి సత్యమల్లిఖార్జున ప్రసాద్ హీరోగా, కోసూరి ఈశ్వరరావు కవిగా, వై. హరిణి కూచిపూడి నర్తకిగా, కౌండిన్య దత్ బాలనటుడిగా తమ పాత్రలకు న్యాయం చేశారు. కొప్పరపు నారాయణమూర్తి, బి.వి.వి. సత్యనారాయణ, గుడిపూడి రాధికారాణి, అప్పినీడి పోతురాజు, పెద్దిరాజు, కాళీపట్నపు ఉమ, శివలక్ష్మి పాల్గొన్నారు.



అభినయ సాంఘిక నాటకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గుత్తికొండ సుబ్బారావు, ధన్వంతరీ ఆచార్య, బాలాజీ తదితరులు



ఏపీఎన్‌జీజీవో చల్లపల్లి యూనిట్ కార్యవర్గం

ఏపీఎన్‌జీజీవో చల్లపల్లి యూనిట్ కార్యవర్గం ఏకగ్రీవం

● అధ్యక్షుడిగా పి.వి.మాధవేంద్రరావు, సహాధ్యక్షుడిగా బ్రహ్మానందరావు

చల్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎన్‌జీజీవో) చల్లపల్లి యూనిట్ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో చల్లపల్లి యూనిట్ అధ్యక్షుడిగా పి.వి.మాధవేంద్రరావు, సహాధ్యక్షుడిగా పూసపాటి బ్రహ్మానందరావు, ఉపాధ్యక్షులుగా జి.వి.రమణ, ఎం.రాజకుమారి, వై.శ్యాంసన్‌బాబు, కార్యదర్శిగా సిహెచ్‌విడి.ప్రసాదరావు, సహాయ కార్యదర్శులుగా జి.రాంబాబు, ఎ.శ్రీనివాసరావు, అబ్దుల్ వాజిద్, వై.శివనాగలక్ష్మి, కోశాధికారిగా కె.రామకోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా కె.రవి అంకినీడుప్రసాద్, పి.విష్ణు, ఎస్.నాగలక్ష్మి, వై.నాగలక్ష్మి, వి.లావణ్య ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా జి.వెంకటేశ్వర్లు, ఓగిరాల నాగమల్లేశ్వరరావు, చెరుకూరి శ్రీనివాసరావు, కె.ద్రాక్షాయణి, తూము శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఎన్‌జీజీవో యూ నిట్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకూరి శ్రీనివాసరావు, ఏ.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. డీపీవో కార్యాలయ ఏవో వి.సీతారామయ్య పరిశీలకునిగా వ్యవహరించగా, అవనిగడ్డ యూనిట్ అధ్యక్షులు బి.రాజేంద్రకుమార్ ఎన్నికల అధికారిగా, కార్యదర్శి శిర్విశెట్టి సురేష్‌కుమార్ సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యవర్గాన్ని ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షులు తోట సుధాకరరావు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వరరావు మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ ఇరిగేషన్ కార్యాలయం ఏఈగా పని చేస్తున్న పులిగడ్డ వెంకటేశ్వరరావు(55) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ తదితరులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఈఈ రావెళ్ల రవికిరణ్, ఇరిగేషన్ డీఈ గణపతి, డీసీ సంఘాల చైర్మన్‌లు నిడమానూరి దిలీప్ కుమార్, బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, భానుప్రకాష్, ఆర్ అండ్ బి డీఈ రమేష్, ఉద్యానశాఖ అధికారి రమేష్, నీటి సంఘం అధ్యక్షులు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ పులిగడ్డ విచ్చేశ్వరరావు, పంచాయతీ సర్పంచ్ దాసరి విజయకుమార్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

నాగాయలంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామపాదక్షేత్రంలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఆదివారం ఉదయం అయ్యప్ప మాలధారులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.

బాలికలకు వస్త్రాలు పంపిణీ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సెమీ క్రిస్మస్ సందర్భంగా షార్కీ హాస్టల్‌లోని 75 మంది బాలికలకు బెల్ రిటైర్డ్ ఆఫీసర్ టి.మాణిక్యాలరావు, వినయకుమారి దంపతులు వస్త్రాలను బహూకరించారు. డాక్టర్ ఆశాలత, స్వర్ణలత, రజని, హాస్టల్ వార్డెన్ మార్టిన్, మణి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి

మోపిదేవి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ తెలిపారు. పెదప్రోలులో జాతీయ రహదారి వెంబడి ధాన్యం ఆరబెట్టుకున్న రైతులతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, రైతు సేవా కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, జనసేన అధ్యక్షుడు పూడషపు రత్నగోపాల్, చందన రంగారావు, బాచు శ్రీనివాసరావు, కోసూరు శివాజీ, డోకిపర్తి బాలకోటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ మెరకనపల్లి నరేష్, యడ్లపల్లి లక్ష్మణరావు (బుజ్జి), కూరేటి రాఘవ, మద్దాల రమణ పాల్గొన్నారు.

దివ్యాంగుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థికసహాయం అందిస్తున్న దిలీప్‌కుమార్, ఉదయ్‌కుమార్

చల్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రామానగరం గ్రామానికి చెందిన గంజాల శ్రీను అనే నిరుపేద దివ్యాంగుని కుటుంబానికి రావెళ్ల కృష్ణ సేవాసమితి చైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ రూ.10 వేల సహాయాన్ని అందజేశారు. అంగవైకల్యంతో 15 సంవత్సరాల నుంచి పనులు చేసుకోలేని స్థితిలో ఉన్న శ్రీనుకు తల్లిదండ్రులు ఒకరి తర్వాత మరొకరు అనారోగ్యంతో మృతి చెందగా, అమాయకంగా ఉండే ఇద్దరు అక్కలు ఉన్నారు. కుటుంబ దీనస్థితిని తెలుసుకున్న ఉదయ్‌కుమార్ స్పందించి తన వంతు బాధ్యతగా రూ.10 వేల సాయాన్ని అందించారు. సేవాసమితి అధ్యక్షుడు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, నీటిసంఘం అధ్యక్షుడు గొరిపర్తి సుబ్బారావు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, నేతలు జన్ను నాంచారయ్య, ముమ్మనేని సన్నీ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు రగ్గుల పంపిణీ



గూడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పేరిశెట్టి నాగరవి ఆధ్వర్యంలో ఆదివారం కప్పలదొడ్డిలో ఒంటరి చేనేత కార్మికులు, దివ్యాంగులకు రగ్గులు పంపిణీ చేశారు. యక్కల సురేష్ కుమారుడు సాయి సంతోష్, జయంతి సుబ్బలక్ష్మి, బోనగిరి నాగకుమార్, పేరిశెట్టి నాగరవి ఆర్థిక సౌజన్యంతో రగ్గులు అందజేశారు. మానవత ప్రధాన కార్యదర్శి కాగి త సాంబశివరావు, విశ్రాంత సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ నాగవరప్రసాద్, కోశాధికారి కొట్టు కోటేశ్వరరావు, బూసం సాయిబాబు, బళ్ల నాగేశ్వరరావు, మరకా విఘ్నేశ్వరరావు, పేరిశెట్టి నాగవరప్రసాద్, పేరిశెట్టి సాయి, బూసం శ్యామలరావు, యక్కల పీతాంబరరావు, పేరిశెట్టి ఘంటేశ్వరరావు, భాస్కరరావు, కోటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా మురళీకృష్ణ



మురళీకృష్ణను అభినందిస్తున్న నేతలు

అవనిగడ్డ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కిసాన్ మోర్చా అధ్యక్షునిగా బచ్చు మురళీకృష్ణను ఆదివారం ఎన్నుకున్నారు. మోదుమూడి గ్రామంలో కిసాన్ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ భూపతి సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి బోగాది చంద్రశేఖర్‌ల నేతృత్వంలో కిసాన్ మోర్చా సమావేశం జరిగింది. బచ్చు మురళీకృష్ణను కిసాన్ మోర్చా మండల అధ్యక్షునిగా ఎన్నుకోగా, ఆయనను రాష్ట్ర కౌలు రైతు సంఘం కన్వీనర్ జి.వి.నగరాయులు, నియోజకవర్గ కో-కన్వీనర్ తుంగల వెంకట గిరి, బచ్చు విజయలక్ష్మి, ఉప్పాల శ్రీదుర్గ తదితరులు అభినందించి కండువాతో సత్కరించారు.

బాధితులకు యాదవ సంఘం బాసట



పెడన రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో ఇటీవల నలుగురు యువకులు విద్యుదాఘాతానికి గురికాగా, ఒకరు మరణించారు. కాలిన గాయాలైన ముగ్గురు చికిత్స పొందుతున్నారు. పెడన నియోజకవర్గ యాదవ సంఘం నాయకులు కొలుసు చందు సోషల్ మీడియా ద్వారా చేసిన వినతికి స్పందించి వచ్చిన రూ.60 వేలను ఉయ్యూరు వెళ్లి ఒకొక్కరికి రూ.15 వేల చొప్పున అందజేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పల్లపోతు అంకరాజు, కొణతం రాంబాబు, పుట్టి నాగరాజు, పుట్టి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు కనపర్తి పరామర్శ

అవనిగడ్డ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విషపు పురుగు కాటుకు గురై రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త గరికపాటి పోతురాజును నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు పరామర్శించారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి పంపించాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, అడపా శ్రీను, కొల్లూరి వాసు, మేడికొండ విజయ్ పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



బంటుమిల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెదతుమ్మిడి పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గశిర ఆర్ద్ర నక్షత్రం సందర్భంగా మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేక నిర్వహించారు. గ్రామ ప్రముఖులు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మట్టా నాగబాబు, విజయలక్ష్మీ దంపతులు, భక్తులు విరివిగా పాల్గొన్నారు.

వెంకట రామయ్య చిత్రపటానికి మండలి నివాళి

మోపిదేవి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నాగాయితిప్ప గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వేములపల్లి వెంకట రామయ్య మృతి చెందగా, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకట రామయ్య కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ బల్లా సీతారామ ప్రసాద్, మాజీ సర్పంచ్ వేములపల్లి రవిచంద్ర, ఏఎంసీ డైరెక్టర్ పుపాల యేసు తదితరులు పాల్గొన్నారు.

126వ రోజూ ఎంవీకేకు ఘన నివాళి



నాగాయలంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంకలో ఎంవికె శతజయంతి వేడుకలు ఆదివారానికి 126వ రోజుకి చేరాయి. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావుతోపాటు కూటమి నేతలు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.